మంగళవారం
20-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 90
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అధ్యయనం చూపిన ఎర్రబాట
కమ్యూనిస్టు కాకాబాబు
కయ్యూరు వీరులారా! లాల్‌సలాం
7లో

పోలవరంపై
గరం... గరం

- అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మాటల యుద్ధం
- వర్షాలు తగ్గగానే నవంబరులో పనులు ప్రారంభం
- నిర్వాసితులకు రూ.10 లక్షలు చెల్లిస్తాం
- చంద్రబాబు నిర్వాకం వల్లే ఇబ్బందులు
- సీఎం జగన్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వర్షాలు తగ్గగానే పోలవరం ప్రాజెక్టు పనులను నవంబరులో ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా పోలవరం ప్రాజెక్టు అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఎన్నికల ముందు పోలవరం నిర్వాసితులకు రూ. 10 లక్షల పరిహారం ఇస్తామన్న జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పటివరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అసలు ఇస్తారా ? లేదా ? చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రాజెక్టు ఎత్తు ఎందుకు తగ్గించారు ? ఎప్పుడు పూర్తి చేస్తారు ? ఎన్నిసార్లు గడువులు పెంచుతారని ప్రశ్నించారు. దీనిపై

- మిగతా 2 లో

ఎడ్లబండ్లతో
వినూత్న నిరసన

అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం
తెలుగు రైతు నేతల అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతు సమస్యలపై సోమవారం తెలుగు రైతు అధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దీనిపై అసెంబ్లీ వరకు నిరసన ర్యాలీ తలపెట్టారు. దీనిపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు బలగాలు భారీ సంఖ్యలో మోహరించారు. ఇటు విజయవాడ, అటు గుంటూరు మార్గాల నుంచి అసెంబ్లీకి వచ్చే అన్ని మార్గాలను నిర్బంధించారు. అడుగడుగునా తనిఖీలు చేపట్టారు. అయినప్పటికీ టీడీపీ శ్రేణులు పోలీసు వలయాలను చేధించుకుంటూ మందడం చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకుని టీడీపీ ఏర్పాటు చేసుకున్న ఎడ్ల బండ్లను తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బండ్లను పోలీస్‌స్టేషన్ నుంచి దూరంగా తరలించి టైర్లలోని గాలి తీసేశారు. దీనిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎడ్లను అరెస్టు చేయడమేంటని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఎడ్ల బండ్లను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వయంగా లాక్కుంటూ రోడ్డుపైకి తీసుకువచ్చారు. ఎడ్లకు బదులు ఎమ్మెల్యేలే కాడి తగిలించుకుని బండిని లాగారు. ఎడ్లబండ్లపై పోలీసు ప్రతాపం ఏమిటంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి అధ్వర్యంలో ఉన్న కోటరీ వల్లే రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. మూడేళ్లుగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని వాపోయారు. మూగజీవాల్ని పోలీసులు తరమడం దుర్మార్గమైన చర్యని దుయ్యబట్టారు. పశువులపై కూడా ప్రభుత్వానికి కనికరం లేదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యల పట్ల శాంతియుతంగా చేస్తున్న నిరసనను కూడా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రైతు ద్రోహి జగన్ అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఫలితంగా అసెంబ్లీ పరిసరాల బయట ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనగా అసెంబ్లీ వరకు ప్రదర్శన నిర్వహించగా, అసెంబ్లీ ముట్టడికి యత్నించిన తెలుగు రైతు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు అమ్మినేని ఎమ్మెల్యేలు కే అచ్చెన్నాయుడు, రామానాయుడు, చినరాజప్ప, బుచ్చయ్య చౌదరి, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పోలీసు వలయాన్ని తోసుకుంటూ అసెంబ్లీ ప్రధాన ద్వారం వరకూ నేతలు ఎడ్ల బండిని లాక్కుంటూ వెళ్లారు.

డిప్యూటీ స్పీకర్‌గా
'కోలగట్ల' ఏకగ్రీవం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా కోలగట్ల వీరభద్రస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ స్పీకర్ పదవికి ఆయన ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. అనంతరం ఆయన స్పీకర్ స్థానంలో ఆశీనులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్, ప్రతిపక్ష నేత అచ్చెన్నాయుడు, మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీ శాసనసభ్యులు డిప్యూటీ స్పీకర్‌కు అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా చట్టసభల్లోకి వచ్చారు... ఆయన కన్నా ముందు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కోన రఘుపతి చేసిన మంచి కూడా సభ ద్వారా అందరికీ తెలియాల్సిన అవసరం ఉంది... పార్టీలో అందరం ఐదు సంవత్సరాలు కొనసాగడం కన్నా... మూడు సంవత్సరాలు కొంతమందిని, మిగతా రెండు సంవత్సరాలు ఇంకా కొంతమందిని తీసుకొచ్చి, వీలైనంత ఎక్కువ మందికి ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమం జరుగుతుంది... దానిలో భాగంగానే రఘుపతి స్థానంలో వీరభద్రస్వామికి అవకాశం ఇచ్చామని తెలిపారు. డిప్యూటీ స్పీకర్‌గా ఈ చట్టసభలో అందరికీ న్యాయం చేసే విధంగా మంచి చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రెండు పర్యాయాలు శాసనసభ సభ్యులుగా, ఒక పర్యాయం శాసన మండలి సభ్యులుగా కోలగట్లకు

- మిగతా 2 లో

రైతు సమస్యలపై రభస సభలో గందరగోళం- టీడీపీ సభ్యుల సస్పెన్షన్ 6లో

అశ్రునయనాలతో బ్రిటన్ రాణి అంత్యక్రియలు 2లో

మహిళా సాధికారత పేరుతో
శ్రమదోపిడీ

- స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం ఇవ్వాలి: ఓబులేసు
- కలెక్టరేట్ల ఎదుట స్కీం వర్కర్ల నిరసన

విశాలాంధ్ర- నెట్‌వర్క్: ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, కనీస వేతనం 26వేలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్కీమ్ వర్కర్లు సోమవారం రాష్ట్ర వ్యాపితంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. కూలి పెంచాలనీ, కూలి పెంపు కోసం రెండు సంవత్సరాలకు జరగాల్సిన ఒప్పందాన్ని వెంటనే చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టరు కార్యాలయాల ముందు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు.

మహిళా సాధికారిత పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు విమర్శించారు. స్కీమ్ వర్కర్ల సమస్యలపై సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాకు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ ఆశ, అంగన్‌వాడి, ఆరోగ్యమిత్ర, తదితర రంగాలలో పనిచేస్తున్న మహిళల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాకముందు ఓట్లకోసం స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా ప్రజల్లోకి తీసుకెల్తున్న మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న ఆశ అంగన్వాడి మధ్యాహ్నం భోజనం ఆరోగ్యమిత్ర మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం 26వేలు అమలు పరచి ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా, మహిళా కార్మికుల శ్రేయస్సు ధ్యేయంగా ఏఐటీయూసీ పని చేస్తుందన్నారు. ఆశా వర్కర్లు అర్హులైన వారిని ఏఎన్ఎంలుగా గుర్తించి కనీస వేతన 26 వేలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు జీతాలు పెంచి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు 15 రుపాయులు పెంచాలని డిమాండ్

- మిగతా 2 లో

చంటిపిల్లతో ఎర్రజెండా చేతపట్టి పాదయాత్రలో పాల్గొన్న మహిళ

ప్రాజెక్టులు తెగడానికి
పాలకులే కారణం

- అధికారుల తప్పిదం వల్లే 'అన్నమయ్య' నీటిపాలు
- రోడ్డునపడ్డ వేలాది కుటుంబాలు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

విశాలాంధ్ర -సుండుపల్లె: పాలకుల నిర్లక్ష్యం వేలాది మంది రైతు కుటుంబాలకు శాపంగా మారిందని, అక్రమ ఇసుక దందా మూలంగానే నీటి ప్రాజెక్టులు తెగిపోయాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలోని యర్రపు రెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా జలాశయం నుంచి అన్నమయ్య జిల్లా

- మిగతా 2 లో

ఇదీ లోకం!



రాష్ట్రంలో రెండు రోజులు
భారీ వర్షం

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

ంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంకు అల్పపీడనం తోడు కావడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ శాఖ సోమవారం తెలిపింది.

2లో

రాజ్‌భవన్లలో ఆర్‌ఎస్‌ఎస్ క్యాడర్

- మోహన్ భగవత్‌ను కలిస్తే తప్పేంటి
- 1986 నుంచే ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుబంధం
- కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్



తిరువనంతపురం: కేరళలోని వామపక్ష ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తూ వివాదాస్పదంగా కాలం వెళ్లదీస్తున్న కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సంస్థతో సన్నిహిత సంబంధాలున్నాయని అంగీకరించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తనకు 1986 నుంచే ఆర్‌ఎస్‌ఎస్‌తో సన్నిహిత అనుబంధం ఉందని చెప్పారు. రాష్ట్ర గవర్నర్ స్థాయిని మరచి ఈ నెల 17న త్రిస్సూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను ఎందుకు కలిశారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆరిఫ్ ఖాన్ సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. 1986లో షా బానో కేసులో తనకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఇవ్వడంతో ఆ సంస్థతో అనుబంధం ఏర్పడిందని గుర్తు చేసుకున్నారు. ఆ కేసు విషయంలో

- మిగతా 2 లో

రాజకీయ పార్టీలకు నగదు
విరాళాలపై పరిమితి

- న్యాయ శాఖ మంత్రికి ఈసీ లేఖ
- ప్రజాప్రాతినిధ్య చట్టంలో సవరణలకు సిఫార్సు

న్యూఢిల్లీ: ఎన్నికల నిధులు నల్లధనాన్ని ప్రక్షాళన చేసేందుకు అనామక రాజకీయ విరాళాలను రూ. 20 వేల నుంచి రూ. 2 వేలకు తగ్గించాలని, నగదు విరాళాలను 20 శాతం లేదా గరిష్ఠంగా రూ. 20 కోట్లకు తగ్గించాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించినట్లు సోమవారం ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీ)లో సవరణలు చేయాలని సిఫారసు చేస్తూ కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు లేఖ రాసినట్లు వివరించాయి. రాజకీయ

- మిగతా 2 లో

డీఏ బకాయిలు ఎందుకు చెల్లించరు?

- ఆర్థికపరిస్థితి బాగుందన్నారుగా...
- ట్రిబ్యునల్ స్థాయిలో కమిషనరేట్ సేవలందించాలి
- శాసన మండలిలో ప్రశ్నించిన కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే డీఏ బకాయిలు ఎందుకు చెల్లించడం లేదంటూ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రశ్నించారు. శాసన మండలిలో సోమవారం వివిధ అంశాలపై కత్తి నరసింహారెడ్డి ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మొత్తంగా 124 నెలల డీఏ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని జీరో అవర్లో ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. జనవరి-2022 డీఏ సైతం ప్రకటించాల్సి ఉందన్నారు. పీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు, పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపుల కోసం ఏడాదికిపైగా ఎదురు చూస్తున్నారని వివరించారు. ఆర్థిక పరిస్థితి బాగుందంటూ ప్రభుత్వం ప్రకటించినందున పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. వెంటనే పెండింగ్ బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయూష్ వైద్యుల వేతనాలు పెంచాలి

ఆయూష్‌లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వైద్యులు సిబ్బందికి ప్రభుత్వ ఉత్తర్వులు 27 ప్రకారం వేతనాలు పెంచాలని కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. 549 ఉత్తర్వుల ప్రకారం పారిశుధ్య కార్మికులకు రూ.16వేల చొప్పున చెల్లించాలన్నారు. 107 పారా మెడికల్ సిబ్బందిని ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 20ఏళ్లుగా పనిచేస్తున్న 107 పారా మెడికల్ సిబ్బందిని ఉద్యోగం నుంచి తొలగించారని, వెంటనే వారిని ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెడికల్ పీజీ సీట్లు పెంచాలి

కొత్తగా 16మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయనున్న సందర్భంలో అదే దామాషా ప్రకారం మెడికల్ పీజీ సీట్లను పెంచాలని కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్(జెడ్పీ) సభ్యుల పదవీకాలం పొడిగింపునకు మద్దతు తెలిపారు. జిల్లాల విభజన వల్ల పదవీ కాలం తగ్గకుండా, జిల్లా పరిషత్ సర్వసభ్య సభ్యులు, చైర్మన్ పదవీ కాలం కొనసాగడానికి చేసిన బిల్లును ఆయన స్వాగతిస్తూ, జిల్లా సమస్యలపై జిల్లా సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.

ఉద్యోగులకు అండగా నిలిచిన ట్రిబ్యునల్

ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ, వ్యక్తిగత సాధింపులకు గురైనప్పుడు, అన్యాయానికి గురైనపుడు ఆంధ్రప్రదేశ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి ఎంతోమంది న్యాయం పొందేవారని కత్తి నరసింహారెడ్డి గుర్తుచేశారు. ఆ ట్రిబ్యునల్ స్థానంలో తాజాగా కమిషనరేట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందన్నారు. ఈ చట్టం చేయడం వల్ల అంతే కాలపరిమితిలో ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నప్పుడే, బిల్లు లక్ష్యం నెరవేరుతుందని సూచించారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటూ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

పోలవరం ఎప్పుడు పూర్తి చేస్తారు?

పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారంటూ ప్రశ్నోత్తరాల సమయంలో కత్తి నరసింహారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా పొందుపరిచారని, సాగు, తాగు విద్యుత్‌కు ఉపయోగ పడే బహుళార్థక ప్రాజెక్టు అని, దీని నిర్మాణానికి, నిర్వాసితులకు పరిహారం, మొత్తం ప్రాజెక్టు పూర్తి కావడానికి ఎంత ఖర్చవుతుందని అడిగారు. కేంద్రం నుంచి రావాల్సింది ఎంత? ఎప్పటికీ పూర్తి చేస్తారో తెలపాలన్నారు.

మంత్రి రజని టీడీపీ నాటిన మొక్క!

- మండలిలో దుమారం రేపిన దీపక్‌రెడ్డి వ్యాఖ్యలు
- దూసుకెళ్లిన వైసీపీ సభ్యుడు దువ్వాడ శ్రీనివాస్
- వైసీపీ, టీడీపీ సభ్యుల వాగ్వాదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసన మండలిలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వైద్యారోగ్యశాఖకు సంబంధించిన ప్రశ్నపై టీడీపీ సభ్యుడు దీపక్‌రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో నాటిన మొక్క వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించబోగా, దానిపై మంత్రితోపాటు వైసీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ సభ్యుడు దువ్వాడ శ్రీనివాస్ తన సీట్లో నుంచి లేచి, దుర్భాషలాడుతూ దీపక్‌రెడ్డి వైపునకు దూసుకొచ్చేందుకు ప్రయత్నించగా, ఆయనను సహచర సభ్యులు అడ్డుకున్నారు. అధికంగా మాట్లాడితే బాగోదంటూ దువ్వాడ తన వేలు చూపుతూ హెచ్చరించారు. ఈ సమయంలో టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీపక్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ సభ్యులు తమ సీట్లలో నుంచి నిలుచున్నారు. దీపక్‌రెడ్డి వ్యాఖ్యలపై జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు స్పందిస్తూ... టీడీపీ అధినేత చంద్రబాబు నాడు కాంగ్రెస్‌లో నుంచి టీడీపీలోకి వచ్చిన మొక్క అంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ సభ్యులు హుందాతనంగా వ్యవహరించాలంటూ, ఒకటి అని, మళ్లీ అన్పించుకోవద్దంటూ హితవు పలికారు. అదే అంశంపై వైసీపీ సభ్యులు, దీపక్‌రెడ్డి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి విడదల రజని సైతం టీడీపీ సభ్యులు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, సీఎం జగన్ అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధమేనంటూ బదులిచ్చారు. చైర్మన్ మోషెన్ రాజు ఇరువర్గాలను సముదాయించడంతో ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. అనంతరం అంబులెన్స్‌లలో వైద్య సదుపాయాలపై దీపక్‌రెడ్డి మాట్లాడుతూ, 108 నిర్వహణా బాధ్యతలను వైసీపీలోని ఓ కీలక నేత బంధువుకు అప్పగించి, కోట్లాది రూపాయల బిల్లులు కేటాయిస్తున్నారంటూ విమర్శించగా, దానిపైనా వైసీపీ సభ్యులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. మళ్లీ టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో చైర్మన్ జోక్యం చేసుకుని మండలిలో లేని వారినుద్దేశించి వ్యాఖ్యలు చేయడం తగదని సూచించారు.

దళిత డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని దళిత డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని దళిత డప్పు కళాకారుల సంఘం(డీడీకే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. సోమవారం అమరావతి సచివాలయంలోని సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజాకు సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. సాంస్కృతిక రంగానికి సేవలందిస్తున్న రోజా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం కళాకారుల అందరికీ గర్వకారణమని మారేళ్ల శ్రీనివాసులు, చిన్నం పెంచలయ్య పేర్కొన్నారు. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందించడంలో ప్రభుత్వం కొన్ని జిల్లాలకే పరిమితమైన సేవలందిస్తోందని, చాలా జిల్లాల్లో ఉన్న డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందక ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలను పొందలేకపోతున్నారని వివరించారు. 2018లో పెన్షన్ మంజూరైన వారికి మాత్రమే వాయిద్య పరికరాలు, దుస్తులు, ప్రభుత్వం నుంచి అందించారన్నారు. తర్వాత మంజూరైన వారికి ఎటువంటి వాయిద్య పరికరాలు, దుస్తులు, గజ్జెలు ఇవ్వలేదని వివరించారు. ప్రతి డప్పు కళాకారుడికి ప్రభుత్వ సౌకర్యాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నియోజకవర్గ స్థాయిలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇప్పించాలన్నారు. డప్పు కళాకారులను తయారు చేసే గురువులకు సంవత్సరానికి ఒక్కసారి రాష్ట్ర ప్రభుత్వం సన్మానం చేసి గౌరవ పారితోషకం ఇవ్వాలని సూచించారు. ప్రతి కళాకారుడికి ప్రమాద మరణమైతే ఐదు లక్షలు, సాధారణ మరణమైతే రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళలను కళాకారులను కాపాడాలనే తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. దళిత డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కుమార్‌రెడ్డి, దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

సాంస్కృతిక శాఖ మంత్రి రోజాకు 'డీడీకే' వినతి

వాడీవేడిగా ప్రశ్నోత్తరాలు

- మండలిలో మంత్రుల సమాధానాలపై టీడీపీ అసంతృప్తి
- టీడీపీ, బీజేపీ వాయిదా తీర్మానాల తిరస్కరణ
- వివిధ బిల్లులు ఆమోదించిన చైర్మన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసన మండలిలో సోమవారం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాల మధ్య ప్రశ్నోత్తరాల కార్యక్రమం వాడీవేడిగా సాగింది. తొలుత టిడ్కో ఇళ్ల పంపిణీపై సభ్యులు మాధవ్, వాకాటి నారాయణరెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానం, రైతులకు గిట్టుబాటు ధరలు అందించే విషయంపై సభ్యుడు అంగర రామ మోహనరావు, మంతెన సత్యనారాయణరాజు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ మోషెన్‌రాజు ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో వివిధ శాఖల మంత్రులు ఇచ్చిన సమాధానాలపై టీడీపీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) ప్రధాన లక్ష్యం, విధులు, కేటాయించిన నిధులు, ఖర్చు, తద్వారా కుళాయిలు మంచినీటి సౌకర్యం పొందిన కుటుంబాల సంఖ్య వివరాలపై సభ్యులు రామచంద్రయ్య, ఇక్బాల్, దువ్వాడ శ్రీనివాస్, చిక్కాల రామచంద్రరావు తదితరులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి) బూడి ముత్యాల నాయుడు సమాధానమిచ్చారు. కేంద్రం అందిస్తున్న నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయని చేస్తున్న ఆరోపణలు సత్య దూరమన్నారు. వైఎస్సార్ పెన్షన్లపై సభ్యులు పోతుల సునీత, కల్యాణి, కల్పలతారెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు బూడి ముత్యాల నాయుడు బదులిచ్చారు. 2019 జూన్ నుంచి ఇప్పటివరకూ మొత్తం రూ.56,937.28 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తద్వారా వ్యవస్థాపకతను ప్రోత్సహించేందుకు చేపట్టిన నిర్దిష్ట కార్యక్రమ వివరాలపై సభ్యులు అరుణ్‌కుమార్, తూమాటి మాధవరావు, శ్రీనివాసరావు, భరత్ తదితరులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సభ్యులకు సుదీర్ఘ సమాధానమిచ్చారు. సులభతర వ్యాపార నిర్వహణలో ర్యాంక్ విషయంపై సభ్యులు మాధవ్‌రావు, రవీంద్రబాబు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అమర్‌నాథ్ బదులిచ్చారు.

రూ.10లక్షల హామీ ఇవ్వలేదు: మంత్రి అంబటి

పోలవరం భూ నిర్వాసితులకు నష్ట పరిహారం విషయంపై సభ్యులు అంగర రామ మోహనరావు, మంతెన వెంకట సత్యనారాయణ రాజు, చిక్కాల రామచంద్రరావు ప్రశ్నలకు జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బదులిస్తూ, పోలవరం భూ నిర్వాసితులకు నష్ట పరిహారంగా ప్రతి ఎకరాకు రూ.10 లక్షలు అందిస్తామంటూ తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం వాస్తవం కాదని తేల్చిచెప్పారు. అనంతరం చౌక ధరల దుకాణాల విషయంపై సభ్యుడు మాధవ్ అడిగిన ప్రశ్నకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారూమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం 29,790 చౌక ధరల దుకాణాలున్నాయని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బియ్యం, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసరాలను కార్డుదారులకు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరఫరా చేస్తున్నామని వివరించారు. ఆక్వా రైతుల లబ్దికోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వివరాలపై సభ్యులు తోట త్రిమూర్తులు, పండుగుల రవీంద్ర బాబు తదితరులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పల రాజు సమాధానమిచ్చారు. భోజన విరామం తర్వాత జరిగిన శాసన మండలిలో వివిధ బిల్లులను ఆమోదించినట్లు చైర్మన్ ప్రకటించారు.

త్వరలో కుటుంబ వైద్యుడు: మంత్రి రజని

త్వరలో 'కుటుంబ వైద్యుడు' విధానం అమల్లోకి తీసుకొస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని తెలిపారు. 104లో వైద్య సదుపాయాల విషయంపై సభ్యులు గుణపాటి దీపక్‌రెడ్డి, దువ్వారపు రామారావు తదితరులు అడిగిన ప్రశ్నలపై ఆమె జవాబిచ్చారు. 104లో మందుల కొరత, వాహనాల సేవల తగ్గింపు విషయం తమ దృష్టికి రాలేదన్నారు. నూతన వైద్య కళాశాలల పురోగతిపై సభ్యులు ఫారూఖ్, రామారావు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతమున్న వైద్య కళాశాలలకు అదనంగా మరో 16 కళాశాలల నిర్మాణానికి అవసరమైన పరిపాలనా అనుమతులు ఇచ్చామని, వాటి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. అదనంగా మన్యం పార్వతీపురంలో ఇంకో వైద్య కళాశాల ప్రారంభానికి సీఎం జగన్ ఇటీవల ఆమోదముద్ర వేశారన్నారు. విషజ్వరాల మరణాల విషయంపై టీడీపీ సభ్యులు ఫారూఖ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రజని సమాధానమిస్తూ, ఎలాంటి మరణాలు సంభవించ లేదన్నారు.

కుమార్తెలతో సహా తండ్రి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు.. పని ఒత్తిడే కారణం
- ఏడు పేజీల సూసైడ్ లేఖ లభ్యం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఓ వైపు తాను కోరుకున్న విధంగా లేని జీవితం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి ఓ తండ్రి జీవితాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఎన్ని రోజులైనా జీవన పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో గతంలోనే ఆ తండ్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే చిన్నారులు అనాథలైపోతారనే కారణంగా విరమించుకోగా, ఈ దఫా మాత్రం తన చిన్నారులతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. ముక్కుపచ్చలారని వారి జీవితాలకు అర్థాంతరంగా ముగింపు పలికాడు.

ఏం జరిగిందంటే..

ఆర్థిక ఇబ్బందులతో ఓ తండ్రి తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజమహేంద్రవరం సమీపంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం నగరంలోని వీఎల్ పురం ప్రాంతంలో నివాసముంటున్న ఫక్కి సత్యేంద్రకుమార్ (40) వివిధ వ్యాపారులకు జీఎస్టీ బిల్స్ సంబంధిత పనులు చూసేవారు. అతడికి భార్య స్వాతి, కుమార్తెలు రిషిత(12), హాద్విక(7) ఉన్నారు. భార్య స్వాతి ఆదివారం శుభకార్యం నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం సత్యేంద్ర తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని రాజమహేంద్రవరం గ్రామీణం పరిధి రాజవోలు రోడ్డులోని చేపల చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో కుమార్తెలు ఇద్దర్నీ తోసేసి తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు సత్యేంద్ర రాసిన ఏడు పేజీల లేఖ పోలీసులకు లభ్యమైంది. తాను కోరుకున్న విధంగా జీవితం లేదని, ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి అధికంగా ఉందని అందులో పేర్కొన్నట్లు తెలిసింది. ఆగస్టులో ఒకసారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నప్పటికీ కుమార్తెలు అనాథలుగా మిగులుతారనే ఉద్దేశంతో ఆ ఆలోచన విరమించుకున్నట్లు లేఖలో ఉంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో ఏపీ టాప్

శాసనసభలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కరోనా వంటి విపత్కర పరిస్థితులను అధిగమించి పారిశ్రామికాభివృద్ధిలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్ స్థానంలో నిలిచినట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర పారిశ్రామికరంగం, ప్రగతిపై శాసనసభలో శనివారం చర్చ జరగ్గా, దానిపై సోమవారం సీఎం ముగింపు ఉపన్యాసం చేశారు. ప్రపంచాన్నే కుదిపేసిన కోవిడ్‌లో కూడా, ఎఫ్‌డీఐ అన్నది తగ్గిపోయిన పరిస్థితిలో కూడా... రాష్ట్రంలో మాత్రం పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు బాగున్నాయన్నారు. పారిశ్రామిక వేత్తలు సంతోషంగా ఉన్నారు కాబట్టే, వరుసగా మూడో ఏడాది కూడా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో సైతం దేశంలో నంబర్ 1గా ఉన్నామన్నారు. పారిశ్రామిక వేత్తలు మన హయాంలో ఎంత సంతోషంగా ఉన్నారో చెప్పడానికి ఇదొక నిదర్శనమన్నారు. "ఇటీవల రాష్ట్రానికి రూ.1000 కోట్లతో బల్క్ డ్రగ్ పార్క్ ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ పార్క్ తెచ్చుకునేందుకు 17 రాష్ట్రాలు పోటీ పడ్డాయి. దేశవ్యాప్తంగా మూడు పార్కులు మాత్రమే ఇచ్చారు. ఒకటి గుజరాత్, ఇంకొకటి ఆంధ్రప్రదేశ్‌కు వస్తే మరొకటి హిమాచల్‌ప్రదేశ్‌కు వచ్చింది. అటువంటి పార్క్ మన రాష్ట్రానికి వస్తుంటే... ఈ పార్క్ మన రాష్ట్రానికి వద్దు అని చంద్రబాబు పార్టీకి సంబంధించిన నాయకుడు యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. ఆయన కౌన్సిల్‌లో టీడీపీకి సంబంధించిన ప్రతిపక్ష నేత. అంటే తెలుగుదేశం పార్టీ అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి ఈ పార్కు వద్దు అని లేఖ రాసింది. ఏ స్థాయిలోకి దిగజారిపోయారో దీన్ని గమనిస్తే తెలుస్తుంది. పక్కనున్న తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ మాకు ఎందుకు ఇవ్వరని ఇదే బల్క్ డ్రగ్ పార్క్ గురించి కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి మాకెందుకు ఆ బల్క్ డ్రగ్ పార్క్ ఇవ్వలేదు అని కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నాడు. పక్కరాష్ట్రాలు మాకెందుకు ఇవ్వడం లేదు అని అడుగుతున్న దాన్ని, టీడీపీ అడ్డుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తుంటే ఇలాంటి వాళ్లను ఏమనాలి?" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి మన ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక రంగం గురించి దుష్ప్రచారం చేయడం తప్ప మరొక పనిలేదన్నారు.

ఎంఎస్ఎంఈలపై దృష్టి

ప్రభుత్వ ఫోకస్ అంతా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగం మీద, దాన్ని నిలబెట్టే కార్యక్రమం మీదఉందని సీఎం జగన్ అన్నారు. మూడేళ్లలో దాదాపు 12 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగం మీద ఫోకస్ పెట్టాం. పారిశ్రామిక రంగానికి రూ. 2858 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు ఇస్తే... ఇందులో ఒక్క ఎంఎస్ఎంఈ రంగానికి మాత్రమే రూ.2500 కోట్లు ఇచ్చామని తెలిపారు. అలాగే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కల్గిన మానవ వనరుల విషయంలో ఏ రాష్ట్రం పెట్టని విధంగా దృష్టి సారించాం...ఇందుకు కారణం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు రిజర్వ్ చేయాలని చట్టం చేయడమేనన్నారు. రాష్ట్రంలో పారదర్శకంగా పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తున్నామని, నీళ్లు, విద్యుత్, రోడ్లు, రైల్వేలైన్లకు సంబంధించిన మౌలిక సదుపాయాలు ఎవరికి కావాలన్నా కల్పిస్తున్నామన్నారు. అందువల్లే రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూలేని విధంగా పారిశ్రామిక దిగ్గజాలు, వారి సంస్థలు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయన్నారు.

రాష్ట్రంలో నమోదైన గ్రోత్ రేట్ 11.43 శాతంతో దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలబడ్డామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 జూన్ నుంచి, ఈయే దాది ఆగస్టు వరకు 99 భారీ పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాయని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లు 35,181 కూడా ఉత్పత్తిలోకి వచ్చాయన్నారు. ఈ 99 భారీ పరిశ్ర మల్లో పెట్టుబడులు రూ.46,280.53 కాగా, వాటి ద్వారా 62,541 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి... అదే రకంగా రూ.9,742.51 కోట్ల పెట్టుబడితో 35,181 ఎంఎస్ఎంఈలు ఏర్పాటు కాగా, వాటి ద్వారా 2,11,374 ఉద్యోగావకాశాలు వచ్చాయి. ఇవి కాకుండా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల వివరాలను పరిశీలిస్తే... రూ.39,655 కోట్ల పెట్టుబడులతో మరో 55 భారీ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి ద్వారా 78,792 ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మరో రూ.91,129.24 కోట్ల పెట్టుబడితో మరో 10 ప్రాజెక్టులకు సంబంధించి, ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయి. ఇవి పూర్తైయితే మరో 40,500 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయని సీఎం వివరించారు. దేశవ్యాప్తంగా 35 మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అభివృద్ధి చేస్తున్నాయి. ఇందులో మన రాష్ట్రానికి మూడు పార్కులు తెచ్చుకోగలిగమని సీఎం జగన్ తెలిపారు.

కొత్త పీఆర్సీ అమలు చేయాలి

- ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు, వైవీ రావు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీలో పదోన్నతులు పొందిన 2096 మందితోపాటు ఉద్యోగులందరికీ ఈనెల నుంచే కొత్త పీఆర్సీ అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వైవీ రావు డిమాండ్ చేశారు. బొప్పరాజు నాయకత్వంలో సోమవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. బొప్పరాజు మాట్లాడుతూ, ఆర్టీసీ-పీటీడీ ఉద్యోగులకు ఇచ్చిన్న పదోన్నతులన్నీ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని, వారితోపాటు 51,488 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఈనెల వేతనంతో కొత్త పీఆర్సీ అమలు చేయాలన్నారు. పాలనాపరమైన ఆమోదాలేమైనా ఉంటే, వాటిని ఆయా శాఖల ఉన్నతాధికారులు చర్చించుకుని, అంతర్గతంగా అనుమతులు పొందాలని, వాటిని సాకుగా చూపి కొంత మందికి వేతనాలు ఆపడం సరికాదని చెప్పారు. ఇప్పటికే ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం కమిటీ సభ్యులు, మంత్రి బొత్స సత్యనారాయణ, ఆర్థిక శాఖాధికారులతో మాట్లాడారని గుర్తుచేశారు. ఆర్థిక శాఖాధికారులతో ఎండీ మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వేతనాలు చెల్లించకుంటే, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ జేఏసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్వీ శేషగిరిరావు, కార్మికపరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.పురుషోత్తమ్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు సిద్ధిఖ్, ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోసూరి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రకటన...

పోలవరం బాధితులకు నిరాశ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీలో పోలవరం ప్రాజెక్టుపై సీఎం జగన్ చేసిన ప్రకటన వేలాది మంది గిరిజన నిరాశ్రయులను నిరాశపరిచిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలుగా వరదలతో ఊళ్లు, ఇళ్లు కొట్టుకుపోయి కట్టుబట్టలతో కొండలు, గుట్టలమీద నివాసముంటున్న గిరిజనుల పునరావాసంపై వివరాలు ఇవ్వకపోవడం విస్మయానికి గురిచేసిందన్నారు. పునరావాస ప్యాకేజీ రూ.6.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ సీఎం చేసిన వాగ్దానంపై ఉత్తర్వులిచ్చి ఏడాది దాటిపోయిందని గుర్తుచేశారు. పునరావాస కాలనీలు ఇంత వరకు నిర్మించలేదని, నిర్మించినవి వరదల్లో మునిగిపోయాయని పేర్కొన్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వకుండా ఎగ్గొట్టిన కేంద్రంపై సీఎం ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తు పరిధిలో 20,946 మంది నిర్వాసితులు వస్తారని చేసిన ప్రకటన వాస్తవ విరుద్ధమని ఖండించారు. వరదల్లో మునిగిపోయిన గ్రామాల జాబితా రప్పించుకుని, మరోసారి పరిశీలించాలన్నారు. ఇప్పటికైనా సీఎం పునరావాసంపై దృష్టిపెట్టి మునక ప్రాంతాల గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా వై రాము, జీ రామన్న

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: నగరంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ రాష్ట్ర 15వ మహాసభలు దిగ్విజయంగా ముగిశాయి. 57 మందితో నూతన రాష్ట్ర కమిటీని 12మంది ఆఫీస్ బేరర్స్‌తో ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా వై రాము, జీ రామన్న, రాష్ట్ర కోశాధికారిగా నగేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జయచంద్ర, రాజు, కేఎఫ్ బాబు, నాగేశ్వర రావు, సహాయ కార్యదర్శిగా శిరీష, విజయ, శివకుమార్, రమణ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో రాష్ట్రంలో 2022 యూత్ ప్లాన్ ప్రకటించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పట్టణ ఉపాధి హామీ పథకం తీసుకు రావాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, యువతుల అభివృద్ధికి ప్రత్యేకమైన కమిషన్ ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ అంతం చేయాలని, కేంద్రంలో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే తీర్మానాలు చేశామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాఘవేంద్ర పిచ్చయ్య, నాయుడు పాల్గొన్నారు.

రీసర్వే ప్రాజెక్టుపై

ఏపీ-నల్సార్ మధ్య ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రీసర్వే ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్ నల్సార్ విశ్వవిద్యాలయం వేదికగా సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం తరుపున సర్వే శిక్షణా సంస్థ వైస్ ప్రిన్సిపాల్ కుమార్, విశ్వ విద్యాలయ ఉప కులపతి అచార్య బాలకృష్ణారెడ్డి అవగాహనా పత్రాలను మార్చుకున్నారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకానికి చట్టపరమైన మద్దతు అందించడం కోసం ప్రభుత్వం ఈ ఒప్పందం చేసుకుంది. 100 సంవత్సరాల తర్వాత వ్యవసాయ, వ్యవసాయేతర భూములపై ప్రభుత్వం రీసర్వే చేపట్టింది. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ సెప్టెంబరు, 2023 నాటికి పూర్తి కానుంది. ప్రతి భూమిని జియో సమన్వయకర్తలతో సర్వే చేసి నంబర్లు ఇవ్వనున్నారు. ప్రాజెక్ట్‌కు చట్టపరమైన పత్రాలను రూపొందించడం, సమీక్షించటంతోపాటు వివిధ అంశాలలో మద్దతు తప్పనిసరి. ఈ ఒప్పందం ఫలితంగా ప్రాజెక్ట్ అమలులో పాల్గొన్న భాగస్వాములకు శిక్షణ అందించటంతో పాటు, రీసర్వే ప్రాజెక్టను బలోపేతం చేసి, సృజనాత్మకంగా అమలు చేయడానికి వినూత్న పైలట్ ప్రోగ్రామ్‌లను రూపొందిస్తారని రీ సర్వే ప్రాజెక్టు కమిషనర్ సిద్దార్థ జైన్ తెలిపారు. రైతుల చట్టపరమైన హక్కులకు సంబంధించిన అన్ని అంశాలలోను ఈ ఒప్పందం క్రియాశీలకం కానుందన్నారు. నల్సార్ నుంచి అచార్య సునీల్ కుమార్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరిందా!

రిజర్వేషన్లు నిరంతరం కొనసాగవలసిన ప్రక్రియ అని రాజ్యాంగ నిర్మాతలు అనుకోలేదు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగం రూపొందించే దశలో ఉన్న అభిప్రాయం. ఈ కొలమానం ప్రకారం చూస్తే హిందువులలోని షెడ్యూల్డ్ కులాలవారు (ఎస్.సి.), గిరిజనులు (ఎస్.టి.) వర్గాలవారు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల వారిని రిజర్వేషన్లు అవసరమైన వారిగా భావించారు. అయితే షెడ్యూల్డ్ కులాల వారు హిందూమతంలో ఉన్న వారే అన్న ఆలోచనతో మొట్ట మొదట వారికే రిజర్వేషన్లు వర్తింప చేశారు. కానీ మతం మార్పిడివల్ల సిక్కు, క్రైస్తవ, ఇస్లాం మతస్థుల్లో కూడా ఎస్.సి.ల పరిస్థితి అంత గొప్పగా లేదు అని రుజువైంది. అంటే మొదట హిందువుల లోని దళితులకే రిజర్వేషన్లు వర్తించాయన్న మాట. గిరిజనులు (ఎస్.టి.) నిజానికి అందరూ హిందూమత చట్రంలోని వారు కాదు. కానీ ఓట్ల కోసం, హిందూమత పరిధి విస్తరించడంకోసం బీజేపీ గిరిజనులందరినీ హిందువులని వాదిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం క్రైస్తవంలోకి మారిన దళితులకు షెడ్యూల్డ్ కులాల స్థాయి కల్పించాలా లేదా అని తేల్చడానికి ఓ జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలనుకుంటోంది. దీనికి ఒక మంత్రి అధిపతిగా ఉండవచ్చు. షెడ్యూల్డ్ కులాల వారు ఇతర మతాల్లోకి మారితే వారికి ఎస్.సి.స్థాయి ఇవ్వొచ్చునా లేదా అని ఈ జాతీయ కమిషన్ పరిశీలిస్తుంది. 1952నాటి దర్యాప్తు సంఘాల చట్టం కింద ఈ కమిషన్ ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. హిందువులు, సిక్కులు, బౌద్ధులు అయిన దళితులకు ఎస్.సి. స్థాయి ఉంది. క్రైస్తవులకు, ముస్లింలకు ఆ సదుపాయం లేదు. ఇదీ మొదట్లో ఉండేది కాదు గానీ 1950లో రాష్ట్రపతి ఉత్తర్వు ఆ తరవాత సవరణల ఆధారంగా సిక్కు, బౌద్ధ మతం స్వీకరించిన దళితులకు ఎస్.సి. స్థాయి, దానితో పాటు రిజర్వేషన్ల సదుపాయం దక్కింది. ఈ విషయంలో కొన్ని పిటిషన్లు ఇప్పటికే సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. 2020 జనవరిలో దళిత క్రైస్తవులు తమకు ఎస్.సి. స్థాయి కల్పించాలని సుప్రీంకోర్టులో అర్జీ దాఖలు చేశారు. అంటే ఎస్.సి. హోదాకు మత పరిధి ఉండకూడదని ఈ పిటిషన్లో కోరారు. ఈ పిటిషన్‌ను విచారిస్తున్న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. సుప్రీం ఇచ్చిన నోటీసుకు కేంద్రం సమాధానం ఇవ్వలేదు కానీ కొత్త కమిషన్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. మొదట ఎస్.సి.లుగా ఉన్న వారు మతం మారినందువల్ల వారు ఎస్.సి.స్థాయి కోల్పోయారు. ఒకవేళ దళిత క్రైస్తవుల అభ్యర్థనను మన్నించి వారిని ఎస్.సి. జాబితాలో చేరిస్తే ఎస్.సి. జనాభాపై ఏ మేరకు ప్రభావం ఉంటుందో కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న కమిషన్ పరిశీలించవలసి వస్తుంది. రాష్ట్రపతి ఉత్తర్వు కారణంగా మతం మారిన దళితులు ఎస్.సి. స్థాయి కోల్పోయారు. షెడ్యూల్డు కులాల వారు ఇతర మతాల్లోకి మారిన తరవాత వారి ఆచార వ్యవహారాలు, సామాజిక, ఆర్థిక స్థితి, ఇతర అంశాలు, వివక్ష ఏ మేరకు మారాయో కూడా కొత్తగా ఏర్పాటు చేసే కమిషన్ పరిశీలించవలసి ఉంటుంది. ఈ కమిషన్‌లో న్యాయవ్యవస్థ ప్రతినిధి, ఉద్యోగ విరమణ చేసిన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి స్థాయి వ్యక్తి కూడా ఉండొచ్చు. అంటరానివారినే ముందు ఎస్.సి.లుగా పరిగణించారు. అంటరానితనం హిందూ మతానికే పరిమితం అనుకున్నారు. 1950నాటి రాజ్యాంగ ఉత్తర్వును తొలగించి ఎస్.సి.స్థాయి కల్పించడానికి మతంతో లంకె పెట్టకూడదని రంగనాథ్ మిశ్రా కమిషన్ 2007లో సిఫార్సు చేసింది. అంటే గిరిజనులలాగే మతంతో నిమిత్తం లేకుండా ఎస్.సి.లను కూడా పరిగణించాలని చెప్పినట్టయింది. కానీ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఈ సిఫార్సు చేయడానికి తగిన క్షేత్ర పరిశీలన ఏమీ జరగలేదు కనక కేంద్ర ప్రభుత్వం అప్పుడు ఈ సిఫార్సును అంగీకరించలేదు. 2008లో మైనారిటీలు, ముస్లింలలో, క్రైస్తవులలో దళితుల పరిస్థితిని మదింపు వేయడానికి ఏర్పాటు చేసిన కమిషన్ దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలను ఎస్.సి.లుగా పరిగణించవచ్చునని చెప్పింది. అయితే ఈ నిర్ధారణకు రావడానికి ఉపయోగించుకున్న సమాచారం విశ్వసనీయమైంది కాదన్న భావనతో ఆ సిఫార్సును కూడా అంగీకరించ లేదు. క్రైస్తవ, ఇస్లాం మతంలో ఉన్న దళితుల గురించి సమాచారం సమగ్రంగా అందుబాటులో లేదు. 2011 జనాభా లెక్కల్లో దళిత క్రైస్తవులు 2.4 కోట్లు, ముస్లిం దళితులు 13.8 కోట్లు ఉన్నారని తేలింది. వీరిలో మతం మారిన వారు ఎంతమందో నికరంగా చెప్పే అవకాశం లేదు. ఈ అంశాన్ని తేల్చాలంటే పూర్తి స్థాయి కమిషన్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

దీనికి మరో కోణమూ ఉంది. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు సందర్భంగా 20 రాష్ట్రాలలో దళిత క్రైస్తవులను ఇతర వెనుకబడిన కులాల (ఓ.బి.సి.) జాబితాలో చేర్చారు. ఈ ప్రాతిపదికన ప్రభుత్వోద్యోగాల్లో, విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కూడా కల్పించారు. వీరికి ఓ.బి.సి.లకు దక్కే ఉపకార వేతనాలు ఇతర ప్రయోజనాలూ కూడా అందుబాటులో ఉన్నాయి. తమను ఎస్.సి.లలో చేర్చాలని, బి.సి.లలో చేర్చాలని అడిగే సామాజిక వర్గాల వారు చాలా మందే ఉన్నారు. ఎస్.సి.లకు రిజర్వేషన్లు కల్పించాలనుకున్నప్పుడు రాజ్యాంగ నిర్మాతలు విదేశీ మతాలు అనుకునే వాటిని అనుసరించే వారిని పరిగణనలోకి తీసుకోలేదు. అయితే క్రమంగా ముస్లింలలో ఉన్న కొన్ని సామాజిక వర్గాల వారికి బి.సి. జాబితాలో చోటు దక్కింది. ఎస్.సి., ఎస్.టి.లకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే ఇతర వెనుకబడిన కులాల వారు కూడా ఉన్నారని అంబేద్కర్ గుర్తు చేశారు. అంటే వెనుకబాటుతనాన్ని రూపు మాపడానికి రిజర్వేషన్లు ఉపకరిస్తాయనే కదా!

అయితే రిజర్వేషన్లను ఏ దశ లోనూ పేదరిక నిర్మూలనా చర్యగా పరిగణించలేదు అని గుర్తుపెట్టుకోవాలి. అలాగే రిజర్వేషన్లకు ఆర్థిక ప్రాతిపదిక కూడా లేదు. కానీ ఇతర వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్ల సదు పాయం కల్పించే సమయంలో సుప్రీంకోర్టు వెనుకబడిన కులాల్లో సంపన్న శ్రేణి అనే వర్గాన్ని ప్రవేశ పెట్టి రిజర్వేషన్లలో ఆర్థిక అంశాలకు చోటిచ్చినట్టయింది. అలాగే వివిధ రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలవారిలో కూడా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆ పేర రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. 2019 లోకసభ ఎన్నికలకు ముందు ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీజేపీ సర్కారు నిర్ణయించింది. ఇది కొన్ని రాష్ట్రాలలో అమలవుతోంది కూడా. ఇంతకీ రిజర్వేషన్లు పేదరిక నిర్మూలనా చర్య కానప్పుడు, ఆర్థిక ప్రాతి పదిక ఎలా జొరబడిందో తెలియదు. సామాజికంగా వెనుకబడిన వర్గాలనే పరిగణించాలంటే ఒక నిర్దిష్ట సామాజిక వర్గంలో వెనుకబాటుతనం లేకుండా చేయడంలో ఈ 75 ఏళ్ల కాలంలో విఫలమైనట్టే!

ఆమె జీవితమంతా నిర్బంధమే!

జె.జె.సి.పి.బాబూరావు

మయన్మార్ ప్రజాస్వామ్య ఉద్యమకారిణి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ అధినేత్రి ఆంగ్ సాన్ సూకీ పేరు తెలియనివారు ఉండరు. దేశంలో ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తున్న ఆమెకు దక్కిన బహుమతి జీవితకాల నిర్బంధం. అవును, సూకీ దాదాపుగా జీవితమంతా నిర్బంధంలోనే ఉన్నారు. ఇప్పటికీ అదే శిక్షను అనుభవిస్తున్నారు. సైనిక జుంటా ప్రభుత్వం అన్యాయంగా ఆమెను అత్యధిక కాలం నిర్బంధంలో ఉంచడమే కాదు జైలుశిక్షలు విధించింది. సూకీ బయటకు రాకుండా అభియోగాల మీద అభియోగాలు మోపి కట్టుదిట్టంగా శిక్షను కొనసాగిస్తోంది. బర్మా స్వాతంత్ర్యం కోసం ఉద్యమించి ప్రత్యర్థుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్న తండ్రి నుండి ఉద్యమ వారసత్వాన్ని అందుకున్న సూకీ నాటికీ నేటికీ అదే తెగింపుతో వ్యవహరిస్తున్నారు. నిర్బంధాలు అధిగమించి ప్రజా గొంతుకగా మారారు. మయన్మార్‌లో ప్రజాస్వామ్య సాధనకు నిరంతరంగా ఉద్యమం నడుపుతూనే ఉన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సూకీ ఉద్యమానికి జుంటా ప్రభుత్వం ఎప్పటికప్పుడు అడ్డుతగులుతోంది. ఆమెను అభియోగాలు, నిర్బంధాలు, జైలుశిక్షలతో కడగండ్లపాలు చేస్తోంది. 1989 జులై 20 న ఆమెను గృహ నిర్బంధం చేసిన ప్రభుత్వం 1995 జులై 10 న స్వల్ప ఆంక్షలతో విడుదల చేసింది. మరోసారి జుంటా ప్రభుత్వం సూకీని 2000 సెప్టెంబరు 23 నుండి 2002 మే 5 వరకు గృహ నిర్బంధంలో ఉంచింది. 19 నెలల తర్వాత 2002 మే 6 న ఐక్యరాజ్యసమితి జరిపిన చర్చల ఫలితంగా విడుదల చేసింది. కొంతకాలం తర్వాత ప్రభుత్వం మళ్ళీ ఆమెని అరెస్ట్ చేసి రంగూన్‌లోని ఇన్సేన్ జైలులో బంధించి 2003లో గృహ నిర్బంధానికి పంపింది. 2005 నవంబరు 28 న సూకీ గృహ నిర్బంధాన్ని మరో ఏడాది పొడిగించింది. 2006 మే 27 నాటికి సూకీ గృహ నిర్బంధం ముగియాల్సి ఉండగా బర్మా ప్రభుత్వం దానిని మరో ఏడాది పొడిగించింది. 2007 మే 25 న ఐక్యరాజ్య సమితి విజ్ఞప్తి చేసినప్పటికీ గృహ నిర్బంధాన్ని మరో ఏడాది పొడిగించింది. మరోసారి 2009 మే 13 న సూకీని అరెస్ట్ చేసి గృహ నిర్బంధ నిబంధనలు ఉల్లంఘించినట్లు అభియోగాలు మోపి 2009 ఆగస్టు 11 న దోషిగా నిర్ధారించారు. ఆమెకి మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. దాదాపు సగం శిక్ష పూర్తి అయ్యాక అంతర్జాతీయ సమాజం ఒత్తిడి కారణంగా 2010 నవంబరు 13 న సూకీని గృహ నిర్బంధం నుండి విడుదల చేశారు. 1989 నుండి 2010 మధ్య గల 21 సంవత్సరాలలో మొత్తంగా 15 ఏళ్ళ పాటు సూకీ గృహ నిర్బంధంలోనే ఉండడం గమనార్హం.

1990 తర్వాత 2016లో తిరిగి బహుళ పార్టీ ఎన్నికలు దేశంలో తొలిసారిగా స్వేచ్ఛగా జరుగగా నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీ 86 శాతం సీట్లు గెలుపొంది చారిత్రాత్మక విజయాన్ని సాధించినా సూకీ దేశ అధ్యక్షురాలు కాలేకపోయారు. మరోసారి 2020 నవంబరు 8న జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్.ఎల్.డి) మెజారిటీ సీట్లను గెలుచుకుని విజయం సాధించింది. కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ మొదటి సమావేశాన్ని నిర్వహించాల్సిన రోజు 2021 ఫిబ్రవరి 1న సైన్యం అన్యాయంగా అధికారాన్ని హస్తగతం చేసుకొని సూకీని అరెస్ట్ చేసింది. సాధారణ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఆమెని పదవి నుండి తొలగించింది. అప్పటి నుండీ సూకీని నిర్బంధంలోనే ఉంచి కేసులు మోపుతూనే ఉన్నారు.

2021 ఏప్రిల్ 1న సూకీపై అధికార రహస్యాల చట్టం ఉల్లంఘన అభియోగాలు మోపిన ప్రభుత్వం 2021 డిసెంబరు 6న 4 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. ఈ ఏడాది జనవరి 10న మిలటరీ కోర్టు మరో ఆరోపణపై వాకీ- టాకీలను సొంతం చేసుకుంది, కరోనా నియమాలను ఉల్లంఘించడం వంటి అనేక ఆరోపణలపై అదనంగా నాలుగు సంవత్సరాల శిక్ష విధించింది. ఈ ఏడాది ఏప్రిల్ 27 న అవినీతి ఆరోపణలపై జుంటా కోర్టు ఆమెకు అయిదు సంవత్సరాల జైలు శిక్షని విధించింది. ఈ ఆగస్ట్ 15 న మరో నాలుగు అవినీతి ఆరోపణల్లో దోషిగా తేల్చారు. దేశద్రోహం, అవినీతి తదితర ఆరోపణలపై 17 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. సూకీపై మొత్తం 18 నేర అభియోగాలు మోపారు. ఎన్నికల్లో జరిగిన అవినీతి కేసులో సూకీకి మరో మూడేళ్ళ పాటు శిక్షను విధిస్తూ సైనిక కోర్టు ఈ సెప్టెంబరు 2న తీర్పుని వెలువరించింది. ఇప్పటికే పలు కేసుల్లో ఆమెకు 17 ఏళ్ల జైలు శిక్ష ఖరారు కాగా తాజాగా విధించిన శిక్ష దానికి అదనపు శిక్ష కావడం గమనార్హం. మయన్మార్‌లో సైనిక పాలన రద్దు కోసం ఉద్యమించి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం సుదీర్ఘ పోరాటం చేసిన సూకీ ప్రస్తుత వయస్సు 76 సంవత్సరాలు. ఈ వయస్సులో ఆమెపై సైనిక జుంటా కోర్టు అన్యాయంగా శిక్షలు విధించడం ప్రభుత్వ కర్కశత్వానికి నిదర్శనం. ఆమెపై అన్యాయంగా మోపిన నేరాలకు శిక్షలు అనుభవించడానికి ఆమె జీవిత కాలమంతా కూడా సరిపోదు. ఇలా అభియోగాలు, గృహ, జైలు నిర్బంధాలు, శిక్షలే ఆమె జీవితంగా మారింది. అయినా మయన్మార్‌లో ప్రజాస్వామ్యం కోసం పరితపిస్తున్న ఆంగ్‌సాన్ సూకీకి హాట్సాఫ్.

వ్యాస రచయిత సెల్ 9493319690.

డాగ్ విజిల్.. నిశ్శబ్ద నిఘా

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

మనుషులకు వినిపించని, కుక్కలకు, పిల్లులకు వినిపించే కుక్కల శిక్షణకు వాడే ఈల డాగ్ విజిల్. ప్రత్యర్థులు పసిగట్టకుండా శ్రోతల, ప్రేక్షకుల మద్దతు కూడగట్టడానికి వాడే రాజకీయ సంకేతాలను డాగ్ విజిల్ అంటారు. జాతి మత కుల ద్వేషాల సమర్థక బృందాలకు అర్థమయ్యే రాజకీయ ఉపన్యాసాలు, వ్యాఖ్యానాలు, ప్రకటనలు, నినాదాలు, మాటలు, కొందరిని ఆకట్టుకొని, కొందరి మానసిక స్థితికి అందని ప్రచారాలు, వాస్తవాన్ని వక్రీకరించి, అర్థాన్ని మార్చి, బయటికి అమాయక అర్థాన్ని, తమవారికి భావగర్భిత సందేశాన్ని ఇచ్చే అస్పష్ట ద్వంద్వార్థ భాష డాగ్ విజిల్. డాగ్ విజిల్‌ను నిశ్శబ్ద ఈల, గాల్టన్ ఈల అంటారు. ఇది మనిషి చెవులు వినలేని స్థాయి శబ్దాన్ని వెలువరిస్తుంది. విక్టోరియా కాలంనాటి బహుముఖ శాస్త్రజ్ఞుడు సర్ ఫ్రాన్సిస్ గాల్టన్ 1876లో ఈ పరికరాన్ని కనుగొన్నారు. జంతువులు వినగల శబ్ద తరంగాల పరిధిని పరీక్షించే ప్రయోగాలను వివరించారు.

ప్రజల భావాలను నియంత్రించే రాజకీయ ఉపన్యాసాలను గొర్రెల మళ్లింపునకు గొర్రెల కాపరులు చేసే శబ్దాలతో పోల్చారు. డాగ్ విజిల్ ఈలలని ప్రచారం చేశారు. కుటుంబ విలువలు పోషించే వ్యక్తికి ఓటేయమంటే క్రైస్తవ అభ్యర్థికి ఓటేయమని అర్థం. యూదు వ్యతిరేక జాత్యహంకారులను ఆకర్షించడానికి అంతర్జాతీయ బ్యాంకులు అన్న సంకేతం వాడారు. డాగ్ విజిల్ ప్రయోగాలను పసిగట్టడం, నిరూపించడం కష్టం. ప్రజాభిప్రాయ సేకరణ, ఎన్నికల ఫలితాల సర్వేలలో డాగ్ విజిల్ తయారైందని అమెరికా రచయిత విలియం సాఫిర్ వివరించారు. వాషింగ్టన్ పోస్ట్ ఎన్నికల నిర్దేశకుడు రిచర్డ్ మొరిన్ 1988లో ఈ పని చేశారని ఆయన అన్నారు. ఆస్ట్రేలియన్ విద్యావేత్త, రచయిత అమండా లోహ్రీ, 'జీసస్‌కు ఓటు: ఆస్ట్రేలియాలో క్రైస్తవం, రాజకీయాలు' అన్న పుస్తకంలో అధిక సంఖ్యాకులను ఆకట్టుకోటం, అల్పసంఖ్యాకులను వేరుచేయటం డాగ్ విజిల్ లక్ష్యమని వివరించారు. ఆస్ట్రేలియా ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో సామాజిక, రాజకీయ శాస్త్రాల ఆచార్యుడు రాబర్ట్ గూడిన్, డాగ్ విజిల్ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తుందని, ఓటర్ల అభిప్రాయాలను పాలకులకు అనుకూలంగా, వారి విధానాలకు మద్దతుగా మారుస్తుందని అన్నారు. ఆస్ట్రేలియా రాజకీయాల్లో డాగ్ విజిల్ 1990ల మధ్యలో ప్రవేశించింది. పూర్వ ప్రధాని జాన్ హోవార్డ్ ఎన్నికల ప్రచారాల్లో విస్తృతంగా వాడారు. ఓటర్లను ఆస్ట్రేలియన్లు కానివారు, ప్రధాన స్రవంతి, చట్టవిరుద్ధం వగైరా సంకేత పదాలతో భ్రమింపజేశారు. శరణార్థులకు వ్యతిరేకంగా జాత్యహంకార భాష వాడారు. జాతివాద ఓటర్లకు మద్దతిచ్చారు. 2007లో పౌరసత్వ ప్రవేశ పరీక్ష ప్రవేశపెట్టారు. ఇది ప్రత్యేక ప్రాంతాల నుండి వచ్చిన శరణార్థులకు పౌరసత్వాన్ని తిరస్కరించింది. జాత్యహంకారులను రెచ్చగొట్టింది.

2015 కెనడా ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ప్రధాని స్టీఫెన్ హార్పర్ సంకేత పదాలను వాడారు. శరణార్థులను, వలసదారులను ఓల్డ్ స్టాక్ కెనడియన్స్ (కెనడా వాసులైన యూరోపియన్లు) అన్న ఎగతాళి పదంతో ఆరోగ్య పథకం నుండి తొలగించారు. శరీర రంగుతో వివక్ష చూపారు. ఆస్ట్రేలియాలో హోవార్డ్‌కు ఎన్నికల ప్రచారం చేసిన లింటన్ క్రోస్బి 2005 యునైటెడ్ కింగ్డం (యుకె) ఎన్నికల్లో డాగ్ విజిల్ ప్రచారం చేశారు. మేము ఆలోచిస్తున్నదే మీరూ ఆలోచిస్తున్నారా?, వలసదారుల నియంత్రణ జాతివాదం కాదు, మీ కుమార్తెలపై దాడి జరిగితే మీకేమనిపిస్తుంది? వగైరా అస్తవ్యస్త ఆస్పత్రులు, దోపిడీలు, పోలీసు వ్యవస్థల నినాదాలతో ప్రకటనల, టివి, పత్రికల ప్రచారాలు నిర్వహిం చారు. 2013 ఎన్నికల్లో ఇంటికెళ్ళండి నినాదం వాడారు. 2016లో ఒబామా, వారసత్వ ద్వేషంతో యుకె ఎన్నికల ప్రచారం చేశారని నిందించారు. 2016 లండన్ మేయర్ ఎన్నికల్లో లేబర్ పార్టీ అభ్యర్థి సాదిక్ ఖాన్‌కు వ్యతిరేకంగా అతను ముస్లిమని, ఉగ్రవాదని, హిందువులు, సిక్కులపై నగల పన్ను వేస్తాడని ప్రచారం చేశారు. థెరస మే, జర్మీ కోర్బిన్‌లు కూడా డాగ్ విజిల్ రాజకీయాలకు పాల్పడ్డారు.

తరంగాన్ని మార్చుకోగల అవకాశమున్న డాగ్ విజిల్

స్థిర తరంగ డాగ్ విజిల్

మొట్ట మొదటి డాగ్ విజిల్ గాల్టన్ విజిల్



తూర్పు ఐరోపా దేశం మోర్దోవా, ఉంఘిని పట్టణంలో హింసాకాండను తప్పించుకోడానికి ఇళ్ల మీద పాలక గుర్తులను కట్టుకున్నారు

అమెరికాలో 1954లో నీగ్రోలను నిగ్గర్లని అవమానించారు. 2007లో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను సూచిస్తూ రాష్ట్రాలు, హక్కులు అన్న సంకేతాలు వాడారు. ఇవి నల్లజాతి వెలివేత, జాత్యహంకార ధృవీకరణకు ఉద్దేశించినవి. 1981లో నిక్సన్ 'దక్షిణ వ్యూహం' పేరుతో శ్వేతజాతీయుల వోట్ల కోసం ఆఫ్రికన్ అమెరికన్లకు వ్యతిరేకంగా జాత్యహంకార ఎత్తుగడ ప్రయోగించారు. ఇవి డాగ్ విజిల్‌లో భాగమని అంతర్జాల పత్రిక స్లేట్ పేర్కొంది. అమెరికా న్యాయశాస్త్ర ఆచార్యులు ఇయాన్ హానీ లోపెజ్ 2014లో 'డాగ్ విజిల్ రాజకీయాలు' అన్న పుస్తకంలో రోనాల్డ్ రీగన్ డాగ్ విజిల్ పేల్చారన్నారు. కాడిలాక్ డ్రైవింగ్, సంక్షేమ రాణులు, చెవులపిల్లుల పుష్టీకరణ, అన్నం టికెట్లతో గొడ్డు మాంసం కొనడం వగైరా నినాదాలతో ప్రభుత్వ పథకాలు పొందుతున్న నల్లజాతీయులను ఎగతాళి చేశారు. 1% ధనికుల, 99% పేదల ఆర్థిక అసమానతలను మరిపించారు. 2004 ఎన్నికల ప్రచారంలో జార్జ్ బుష్, సలహాదారుడు కార్ల్ రోవ్, డాగ్ విజిల్ వాడారని అమెరికా పాత్రికేయుడు, రచయిత క్రెగ్ ఉంగర్ రాశారు. 'రాజ్యాంగంలో నల్లజాతివారికి పౌరసత్వం లేదని' 1857లో అమెరికా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఇది డ్రెడ్ స్కాట్ నిర్ణయంగా ఖ్యాతి చెందింది. ఎన్నికల ప్రచారంలో బుష్ ఈ తీర్పును మర్మగర్భంగా ప్రస్తావించేవారు. 2008 డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎంపికలో హిల్లరీ క్లింటన్, 'బరాక్ ఒబామా నల్లజాతీయుడనీ, ఆయన మద్దతుదారులు శ్వేతజాతి వ్యతిరేకులని' డాగ్ విజిల్ భాష వాడారు. 2012 ఎన్నికల్లో, ఒబామా అమెరికాను ప్రేమించడని టీ పార్టీ, మిట్ రోమ్నీ మనలో ఒకడు కాదని ఒబామా ప్రచారం చేశారు. ఇద్దరూ జాతివాదం పాటించారని వాషింగ్టన్ పోస్ట్ పాత్రికేయుడు కారెన్ టుముల్టి రాశారు. 2014 ఎన్నికల్లోనూ డాగ్ విజిల్ పాటించారు. 2016లో ట్రంప్ ప్రచారం డాగ్ విజిల్ పద్ధతిలోనే సాగింది. అమెరికా అమెరికన్లకే, అమెరికా గొప్పదనాన్ని తిరిగి సాధిద్దాం, ముస్లింలకు ఉగ్రవాద దాడులు ముందుగానే తెలుసు, వలసదారులు అత్యాచారులు వంటి పదాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ట్రంప్ డాగ్ విజిల్ రాజకీయాలను దాటిపోయారని తత్వవేత్త జెన్నిఫర్ సాల్ వ్యాఖ్యానించారు. డాగ్ విజిల్ ఆమోద నిరాకరణ కీలక గుణమని, ఎవరైనా ఏమైనా అనగల స్పష్టమైన ప్రక్రియ అని అమెరికన్ విశ్వవిద్యాలయాల ప్రముఖులు వ్యాఖ్యానించారు.

భారత్‌లో డాగ్ విజిల్ పాతదే. 2013కు ముందు డాగ్ విజిల్ రాజకీయాలు నేల మీద నడిచేవి. ఇప్పుడు నింగికి ఎగిశాయి. ఎన్నికల ఫలితాలను తారుమారు చేశాయి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయి. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కాయి. ప్రధాని కావాలన్న ఉద్దేశంతో పటేల్, నెహ్రూను చైనా సరిహద్దు పరిష్కారం దిశలో లాగారు. నెహ్రూ తెలివిగా చైనా సరిహద్దు వివాదాస్పదమే కాదని ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. అది నేటికీ కొరివిలా కాలుతోంది. నేలను చదును చేయండని వాజపేయి కరసేవకులకు సూచించారు. ఇది మసీదును కూల్చమన్న సంకేతమిచ్చింది. గోధ్రా మారణ హోమంలో మోదీ రాజధర్మం పాటించలేదన్నారు ప్రధాని వాజపేయి. నేనదే చేశానన్నారు మోదీ. సమాచార హక్కు సవరణ, ముమ్మాటి తలాక్, పౌరసత్వ సవరణ, నూతన విద్యా విధానం, వ్యవసాయ, అత్యవసర వస్తు చట్టాలు, కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, ఒకే దేశం ఒకే సంస్కృతి, పుణ్యభూమి, లవ్ జిహాద్ నినాదాలు డాగ్ విజిల్ రాజకీయాలే. ప్రజలు విధ్వంస చర్యల నుండి కాపాడుకోడానికి, కొన్ని ప్రయోజనాలను పొందడానికి పాలకపక్ష పతాకాలను ఇళ్ల మీద ఎగరేస్తారు. ఇది డాగ్ విజిల్ చర్య. నేటి నాయకుల ప్రకటనలు డాగ్ విజిల్ రూపకాలు. అమెరికా పూర్వ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్, భారత ప్రథమ ప్రధాని నెహ్రూ ఉపన్యాసాలు డాగ్ విజిల్ ఉపమానాలు.

ట్రంప్, మోదీలు ఓడినా ట్రంపిజం, మోదీయిజం రూపంలో డాగ్ విజిల్ కొనసాగుతుంది. అవి తిరిగి తలెత్తకుండా చేయడం అవసరం. అమెరికా ముందు, అమెరికా గొప్ప అన్న వాగ్దానాలను ట్రంప్ పూర్తి చేయలేదు. అమెరికన్లు గొప్పవారని అమెరికన్ ఓటర్లు రుజువు చేశారు. ఆ ప్రక్రియ మన దేశంలోనూ జరగాలి. కొత్త సంవత్సరాలలో అబద్ధాలను సాగనంపాలి. నిజాలను నిలబెట్టాలి.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, 9490204545

తాడో పేడో అంటూ కాంగ్రెస్ జోడో యాత్ర

ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నిర్ణయం తీసుకుని, రాహుల్ ఆధ్వర్యంలో భారతదేశ యాత్ర చేపట్టింది. ఇంతవరకూ అధినేత రాహుల్ గాంధీ దశాబ్దమున్నర కాలంగా అప్పుడప్పుడూ మెరుపు యాత్రలు, విహార యాత్రలు చెయ్యడం తప్పించి సీరియస్‌గా ప్రజలతో నడిచింది లేదు. ఇప్పుడు కన్యాకుమారి నుండి కాశ్మీర్ దాకా 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్ని స్పృశిస్తూ ఐదు నెలల పాటు, 3500 కిలోమీటర్లు పాదయాత్రకు బయలుదేరడం అభినందనీయం. తద్వారా ప్రజల సమస్య లేమిటో ప్రత్యక్షంగా చూడడం అన్న ప్రాథమిక బాధ్యత నెరవేరుతుంది. వాటిపై ఒక రాజకీయ పార్టీగా ఎలా స్పందించాలి, తాము చూపించే పరిష్కార మార్గాలేమిటి అన్నవి ఎంచుకోవడం తదుపరి బాధ్యత. వాటిని ప్రజలెంత వరకూ నమ్మారు, ఎంత ఆమోదించారు అన్న వాటిపై ఆ పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంది. ప్రజలు పూర్తి విశ్వాసం కనపర్చినా వాటిని ఓటు పవర్‌గా మార్చుకోవడం, అలా మార్చుకోగల పటిష్టమైన పార్టీ నిర్మాణం చేసుకోవడం ఇంకో రాజకీయ గమ్యం ఆ పార్టీకి. ఏదైనా ప్రజలకు చేరువ కావడం ప్రాథమిక అంశం కాబట్టి ఆ దిశగా ఆ పార్టీ చేస్తున్న బృహత్ ప్రయత్నమిది. ఎందుకంటే ఆ పార్టీ బలపడడం ఆ పార్టీకే సంబంధించిన వ్యవహారం కాదు. దేశానికి కూడా మేలు చేసే కార్యక్రమం. రాష్ట్రాల వారీగా బలమైన ప్రాంతీయ పార్టీలు ఎక్కువగానే ఉన్నా, జాతీయ స్థాయిలో బీజేపీని సవాల్ చేసే స్థాయి పార్టీలు లేవు. దేశానికి బలమైన స్థిరమైన అధికార పక్షం ఎంత అవసరమో, బలమైన ప్రతిపక్షం కూడా అంతే అవసరం. ఒకప్పుడు తిరుగులేని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఎక్కడా తిరగలేని పార్టీగా మిగిలింది. ప్రజల నుండి దూరమై, నాయకత్వలేమితో కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. అయినా దేశ వ్యాప్తంగా ఆ పార్టీ ఎంతో కొంత గుర్తింపుని కలిగే ఉంది. కాబట్టి ఆ పార్టీ బలపడితే జాతీయ స్థాయిలో దీటైన ప్రత్యా మ్నాయం కాలేకపోయినా, అలాంటి ప్రాంతీయ ప్రత్యామ్నాయాల్ని కలిపి ఉంచగల శక్తిగా ఉంటుంది. ఆరోగ్యకర ప్రజాస్వామ్యానికి అవసరం ఇది. ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర చేసి అధికారం పొందిన దివంగత వైఎస్సార్.. 'పాదయాత్ర వల్ల తన కోపం నరం తెగింది' అని అంటుండేవారు. అంటే సహనం పెరిగింది అని అర్థం. అలాగే రాహుల్ గాంధీ ఈ యాత్రతో 'అస్థి రత్వం నరం' వదులుకోవాలి. తన మానసిక స్థిరత్వం పెంచుకోవాలి. అప్పుడు ఆ పార్టీకి ఒక స్థిరమైన నాయకుడు దొరుకుతాడు. తరవాత శ్రేణులు, నేతలు బలపడి ఆ పార్టీకి పునర్వైభవం పొందడానికి అవకాశం దొరుకుతుంది.

- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, 9440836931.

స్వామి వ్యాఖ్యలపై బీజేపీ మౌనమెందుకు?

ఎం.కోటేశ్వరరావు

"భారత్ తన ప్రాంతాన్ని కోల్పోయిందనే మాటల మధ్య వాస్తవాధీన రేఖ వద్ద ముగిసిన సేనల ఉపసంహరణ" అనే శీర్షికతో డెక్కన్ హెరాల్డ్ పత్రిక ఒక వార్త నిచ్చింది. ఇతర పత్రికలు కూడా వేరే శీర్షికలతో ఈ వార్తను ఇచ్చాయి. లద్దాఖ్ సరి హద్దులోని గోగ్రా-హాట్‌స్ప్రింగ్స్ లేదా పెట్రోలింగ్ పాయింట్-15 (పిపి15) ప్రాంతంతో పాటు పిపి-16 నుంచి రెండు వైపుల చైనా-భారత్ మిలిటరీని ఉపసంహరించుకున్నాయి. అంగీకృత ప్రాంతంలోని తాత్కాలిక కట్టడాలు, మిలిటరీ మౌలిక సదుపాయాలను తొలగించారా లేదా అని మిలిటరీ సంయుక్త బృందాలు ఈ మేరకు తనిఖీ పూర్తి చేసినట్లు వార్తలు రాగా అధికారికంగా మనదేశం నిర్ధారించ లేదు. ఒప్పందం ప్రకారం రెండు పక్షాలు ఇప్పటి వరకు ఎక్కడైతే ఉన్నాయో అక్కడి నుంచి సమానదూరం వెనక్కు తగ్గాలి. ఆ ప్రాంతాలలో మిలిటరీ ఉండకూడదు. దానికి వెలుపల ఉండవచ్చు. ఇంతకుముందు గాల్వన్ లోయ నుంచి 2020 జూన్‌లో, పాంగాంగ్ సో సరస్సు ఉత్తర గట్టు నుంచి 2021 ఫిబ్రవరిలో, ఆగస్టులో గోగ్రా పోస్టు నుంచి ఉపసంహరించుకోవటంతో పాటు వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) కి ఇరువైపులా ఎలాంటి తనిఖీలు లేని ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని రెండు దేశాలు అంగీకరించాయి.

తాజా పరిణామాలపై బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి ట్విటర్‌లో స్పందించారు. "వాస్తవాధీన రేఖ వెంబడి రెండు వైపులా చైనా-భారత్ మిలిటరీ ఉపసంహరణ జరిగిందని మోదీ ప్రభుత్వ ప్రకటనను ఉటంకిస్తూ మీడియాలో వచ్చిన వార్తలను చూసి చైనీయులు నవ్వుతున్నారు. నిజం ఏమంటే, భారత్ వైపు ప్రాంతం నుంచి చైనా, భారత ప్రాంతం నుంచి భారత్ ఉపసంహరించుకుంది. "మాది ఏదైతే ఉందో అది మాదే, మీది ఏదైతే ఉందో అది కూడా మాదే అని దీని అర్థంగా చైనా చెబుతోందని" పేర్కొన్నారు. తమ పార్టీ ప్రముఖుడే ఆరోపించినందున కేంద్ర ప్రభుత్వం, బీజేపీ దీని మీద స్పందించి అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంది. వాస్తవాలకు భిన్నంగా స్వామి ప్రకటనలు, ప్రచారం ఉన్నట్లయితే తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు స్వామి మీద చర్య తీసుకుంటుందా? లద్దాఖ్‌లో చైనా అక్రమంగా కొన్ని ప్రాంతాలను ఆక్రమించినట్లు నరేంద్ర మోదీ చెప్పటం లేదని కూడా కొద్దివారాల క్రితం స్వామి సెలవిచ్చారు. ఎవరూ ఆక్రమించలేదని చెప్పే మూర్ఖస్థితిలో ఉన్నారని అన్నారు.

గతంలో ఉపసంహరించుకున్న ప్రాంతాలలో కూడా మన దేశం కొంత ప్రాంతా న్ని కోల్పోయినట్లు కొందరు మాజీలు చెప్పినట్లు టెలిగ్రాఫ్ పత్రిక పేర్కొన్నది. లద్దాఖ్ ప్రాంతంలో ఘర్షణ ఉన్న వివిధ ప్రాంతాల్లో మిలిటరీ ఉండని లేదా గస్తీ లేని ప్రాంతాలను ఏర్పాటు చేయటం పరిష్కారం కాదని, చైనా షరతులకు మనం అంగీ కరిస్తున్నామని ఒక మాజీ లెఫ్టినెంట్ జనరల్ అన్నట్లు రాసింది. సేనల ఉపసంహార ణల క్రమంలో భారత భూభాగంలో బఫర్‌జోన్లకు ఎందుకు అంగీకరిస్తున్నట్లు అని ప్రశ్నించినట్లు పేర్కొన్నది. గతంలో సేనల ఉపసంహరణ జరిగిన చోట్ల కూడా బఫర్‌జోన్లను ఏర్పాటు చేశారు. రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల వరకు ఎవరూ ప్రవేశించకూడని ప్రాంతాలను బఫర్ జోన్లు అని పిలుస్తున్నారు. ప్రాంతాలను బట్టి ఇంకా ఎక్కువ కూడా ఉండవచ్చు. డెప్సాంగ్ మైదానాల నుంచి రెండు వైపులా సేనల ఉపసంహరణ జరగాల్సి ఉంది. బఫర్ జోన్లను అంగీకరించటం అంటే అది వాస్తవాధీన రేఖకు రెండు వైపులా జరుగుతుంది. దాని అర్థం ఆ ప్రాంతంపై సదరు దేశం హక్కును వదులుకున్నట్లు ఎలా అవుతుంది?

ఎలాంటి పోరు లేకుండానే వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర మన ప్రాంతాన్ని మోదీ సర్కార్ చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 2020 ఏప్రిల్ నాటి స్థితిని పునరుద్ధరించేందుకు చైనా తిరస్కరిస్తోందని, అప్పగిం చిన ప్రాంతాన్ని ఎప్పుడు వెనక్కు తీసుకుంటారని ప్రశ్నించారు. సరిహద్దుల్లో ఒక సమస్య పరిష్కారమైందని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. సుబ్రమణ్య స్వామి, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల మీద ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వివరణ లేదు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేసిన ఆరోపణ జవాబుదారీతనంతో కూడుకున్నది కాదు. ఈ వార్తల మీద నిలదీసే హక్కు రాహుల్‌కు వుండవచ్చు తప్ప నిర్ధారించి చెప్పటం ఏమిటి? సుబ్రమణ్యస్వామి వ్యవహారం అది కాదు, అధికార పార్టీలో ఉంటూ మన విదేశాంగ విధానాన్ని తప్పుపట్టటం ఏమిటి? పోనీ స్వామి చెప్పిన అంశాలు, వైఖరి పార్టీ విధానం కాదని బీజేపీ ప్రకటించాలి కదా! దాని మౌనానికి అర్థం ఏమిటి? స్వామి వంటి వారు చేస్తున్న వాదనలు, విమర్శలు సామాజిక మాధ్యమం, మీడియా, వివిధ సంస్థలలో తిష్టవేసిన బీజేపీని బలపరిచే కాషాయ దళాలు చేస్తున్నవే. పార్టీ నుంచి వెలుపలికి వచ్చి స్వామి తనకు తోచిందాన్ని మాట్లాడితే అదొక తీరు.

భారత్ - చైనా సరిహద్దులను వాస్తవాలతో నిమిత్తం లేకుండా కాగితాల మీద బ్రిటీష్ వారు గీచిన రేఖ వలన వివిధ ప్రాంతాలు తమవంటే తమవని రెండు దేశాలూ చెబుతున్నాయి. రెండు దేశాలకు స్వాతంత్ర్యం వచ్చే నాటికి మనదని చెబుతున్న ఆక్సాయిచిన్ చైనా ఆధీనంలో, తమది అని చైనా చెబుతున్న అరుణాచల్ ప్రదేశ్ మన ఆధీనంలో ఉన్నది. ఇంకా ఇలాంటివి ఉన్నాయి. వీటిని సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవటం మినహా మరొక మార్గం లేదు. ప్రస్తుతం డెప్సాంగ్ మైదానాల్లో మనది అని చెబుతున్న చోట్ల పద్దెనిమిది కిలోమీటర్ల లోపలికి చైనా మిలిటరీ వచ్చిందని చెబుతున్నారు. గాల్వన్ ఉదంతం జరిగినపుడు మన ప్రాంతాల ఆక్రమణ జరగలేదని ప్రధాని మోదీ చెప్పటాన్ని బట్టి ఆ ప్రాంతం ఎప్పటి నుంచో చైనా ఆధీనంలో ఉన్నదని భావించాల్సి ఉంటుంది. మాజీ మిలిటరీ అధికారులు, నిపుణులు అని చెప్పుకుంటున్నవారు, కొందరు రాజకీయ నేతలు, దేశభక్తుల ముసుగులో ఉన్నవారు చెప్పే భాష్యాలు జనంలో మనోభావాలను రగిల్చేందుకు తప్ప ఇతరంగా పనికి రావు. చైనాతో అధికారిక చర్చల్లో పాల్గొనే పౌర, మిలిటరీ ఉన్నతాధికారులకు ఇవేమీ తెలియవని, వారికి దేశభక్తి లేదని, మన భూభాగాన్ని రక్షించుకోవాలనే తపన లేనివారని అనుకోవాలా? గత 28 నెలలుగా రెండు దేశాల మధ్య నెలకొన్న ఘర్షణ, పరస్పర అనుమానాలు తొలగాలంటే సంప్రదింపులు తప్ప మరొక మార్గం లేదు. ఇప్పటి వరకు 16 దఫాల చర్చలు జరిగాయి.

దాదాపు ఏడాది పాటు స్తంభించిన చర్చలు ఆకస్మికంగా ఫలించి మరొక అడుగు ముందుకు పడి మరొక ప్రాంతం నుంచి సేనలు వెనక్కు తగ్గటం వెనుక కారణాల గురించి చర్చ జరుగుతోంది. ఉక్రెయిన్ సంక్షోభం ఇప్పట్లో ముగిసేట్లు కనిపించకపోవటం, ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌ఖండ్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఓ) సమావేశాలు ఒక కారణంగా భావిస్తున్నారు. సోవియట్ విచ్ఛిన్నం తరవాత ఏర్పడిన మధ్య ఆసియా రిపబ్లిక్‌లతో సరిహద్దుల్లో మిలిటరీల మధ్య విశ్వాసాన్ని మరింతగా పెంచేందుకు కుదిరిన అవగాహనను మరింత ముందుకు తీసుకుపోవటానికి ఏర్పడినదే షాంఘై సహకార సంస్థ. చైనాతో ఉన్న సరిహద్దుల వివాదాల పరిష్కారం కూడా ఎస్‌సిఓ ఏర్పాటు వెనుక ఉంది. ఇందులో 2006 నుంచి పరిశీలక దేశాలుగా ఉన్న భారత్, పాకిస్తాన్‌లు 2017లో సభ్య దేశాలుగా చేరాయి. ఏటా జరిగే ఎస్‌సిఓ శిఖరాగ్ర సమావేశాల్లో మోదీ, జిన్‌పింగ్ భేటీ కావచ్చన్న వార్తల నేపథ్యం లద్దాఖ్ ప్రాంతంలో సేనల ఉపసంహరణకు దారితీసిందని కొందరు భావిస్తున్నప్పటికీ ఇదే ప్రధాన కారణంగా చెప్పలేం.

బీజేపీకి సవాల్‌గా హిమాచల్

- అంతర్గత వర్గపోరుతో సతమతం
- పీడిస్తున్న అవినీతి - పరిపాలనా వైఫల్యం
- అసంతృప్తిలో ప్రభుత్వోద్యోగులు, రైతులు

న్యూదిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో అవినీతి రాజ్యమేలుతోంది. పరిపాలన భ్రష్టుపట్టిపోయింది. దీంతో రాష్ట్రంలోని బీజేపీ నేతృత్వ ఠాకూర్ ప్రభుత్వం చిక్కుల్లో పడింది. అవినీతి, పరిపాలనలోపం, అపరిష్కృత డిమాండ్లు వంటివి వచ్చే ఎన్నికలలో బీజేపీకి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. బీజేపీలో అంతర్గత పోరు కూడా ఆ పార్టీని కలవర పెడుతున్నది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తన అనుచరులకు ఉన్నత పదవులు కట్టబెట్టి రాష్ట్ర రాజకీయాలను శాసించాలని చూస్తున్నారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి ప్రేమ్‌కుమార్ ధుమల్ వర్గీయులు అసంతృప్తిగళాన్ని బిగ్గరగానే వినిపిస్తున్నారు.

రాష్ట్ర అసెంబ్లీకి ఈ ఏడాది చివరిలో ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ గత ఏడాది మరణించడంతో సంప్రదాయ ప్రత్యర్థి నుంచి ఉండే పోటీ కూడా లేకుండా పోయింది. మొదట్లో ఈ రాష్ట్రంపై ఆసక్తి కనబర్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇప్పుడు గుజరాత్ ఎన్నికలపై పూర్తిగా దృష్టిపెట్టింది. 1985 తర్వాత రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన పార్టీగా బీజేపీ నిలిచింది. ప్రేమ్ కుమార్ ధుమాల్, జేపీ నడ్డా మధ్య వర్గపోరు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు. 2017 ఎన్నికల్లో బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన ధుమాల్ సుజన్‌పూర్ నుంచి ఓడిపోవడంతో ఆయనను పార్టీ పరిగణించలేదు. ధుమాల్ స్థానంలో నడ్డాకు విధేయుడైన జై రామ్ ఠాకూర్‌ను సీఎంగా బీజేపీ ఎంపిక చేసింది. ఇది ధుమాల్‌కు మింగుడు పడలేదు.

పక్క రాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి బీజేపీకి ఎదురైంది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖతిమా నియోజకవర్గం నుంచి ఓడిపోయినాగానీ ముఖ్యమంత్రిగా ఉన్న పుష్కర్ సింగ్ ధామికి సీఎం పదవిని బీజేపీ తిరిగి కట్టబెట్టింది. ఈ పరిణామం ధుమాల్ అసంతృప్తికి ఆజ్యంపోసినట్లు అయింది. ధుమాల్ జూన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, 'ఉత్తరాఖండ్‌లో ధామి ఓటమికి కారణాలను విచారించగలిగితే హిమాచల్‌లో నా ఓటమికి కారణాలనూ విచారించవచ్చు' అని అన్నారు. అప్పటి నుంచి పార్టీకి సంబంధించి అన్ని నిర్ణయాలను నడ్డా, ఠాకూర్‌లే తీసుకుంటున్నా ధూమాల్ వర్గీయులు ఎక్కడా తగ్గలేదు. తమ అసంతృప్తిని ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. దీంతో పార్టీలో అసంతృప్తి బయటపడింది.

ధుమాల్‌కు ఓటివేసి అధికారంలోకి తేవాలని సుజన్‌పూర్ ఓటర్లకు రాజ్యసభ సభ్యులు ఇందూ గోస్వామి గతనెలలో పిలుపునిచ్చారు. ఈ పరిణామం పార్టీలో చాలా మందిని ఆశ్చర్యపరిచింది. 75ఏళ్లుపైబడిన వారికి టికెట్లు ఇవ్వకూడదని పార్టీ నిర్ణయిస్తే 78ఏళ్ల ధుమాల్ తరపున గోస్వామి ప్రచారం చేయడం ఏమిటన్న ప్రశ్న తెరపైకొచ్చింది. అయితే దిల్లీ నుంచి బీజేపీ సాగిస్తున్న పరిపాలనతో పార్టీ నాయకులు అనేకమంది అసౌకర్యానికి గురవుతున్నారని స్పష్టమైంది.

కాంగ్రెస్, స్వతంత్ర నేతలను పార్టీలో చేర్చుకోవడాన్ని బీజేపీ వర్గీయులు ప్రతిఘటించారు. కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఆ పార్టీ నేతలు కొందరు బీజేపీ గూటికి చేరారు. ఇది కమలం దళానికి సమస్యగా మారింది. బీజేపీ విధేయులను వెనక్కునెట్టే విధంగా కాంగ్రెస్, స్వతంత్ర నేతల చేర్పింపు ధుమాల్ వర్గంలో కోపాన్ని పెంచింది. ఈ క్రమంలో రెండు ఘటనలు జరిగాయి. డెహ్రా నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే హోషియార్ సింగ్ గత ఎన్నికలలో బీజేపీ ఎమ్మెల్యే, ధుమాల్ అనుచరుడు రవీంద్ర సింగ్ రవిని ఓడించారు. ఇప్పుడు ఆయన పార్టీలో చేరారు. దీనిని ధుమాల్ తనయుడు, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వ్యతిరేకించారు. కాంగ్రెస్ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పవన్ కాజల్, ఆ పార్టీ ఎమ్మెల్యే లఖ్వీందర్ సింగ్ రాణా కూడా కాషాయ కండువా కప్పుకోగా వారి చేరికలను బీజేపీ కార్యకర్తలు వ్యతిరేకించారు. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ రాజకీయ పగ్గాలను అనురాగ్ చేపట్టాలన్నది ధుమాల్ ఆకాంక్ష. కానీ నడ్డా అది జరగనివ్వడం లేదు. రాష్ట్ర రాజకీయాల్లో పట్టు పెంచుకున్నారు. ఈ ఏడాది ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన రాజీవ్ బిందాల్ సైతం నడ్డా విశ్వసనీయుడని తెలుస్తోంది.

రాష్ట్రంలోని ఠాకూర్ ప్రభుత్వాన్ని అవినీతి, పరిపాలన వైఫల్యాలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాలనీ, ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వారు డిమాండు చేశారు. అవినీతిపరులతో ఠాకూర్ ప్రభుత్వం మెతకగా ఉందన్న విమర్శ ఉంది. అవినీతి ఆరోపణల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బిందల్ రాజీనామా చేయాల్సి వచ్చింది. పోలీసు కానిస్టేబుళ్ల నియామకాల పరీక్షాపత్రం లీకేజి కూడా తలనొప్పిగా మారింది. ఆ పరీక్షను రద్దు చేసి, కేసును సీబీఐకు ఠాకూర్ ప్రభుత్వం అప్పగించింది. మరోవైపు పండ్ల సాగుదారులు, రైతులూ అసంతృప్తిగానే ఉన్నారు. లంపీ స్కిన్ డిసీజ్ (ఎల్ఎస్‌డీ) కారణంగా పశుమరణాలు అన్నదాతలకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి. సాగుదారుల ఆందోళనలు కనీసం 21 నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సారథ్యంలో పండ్ల సాగుదారులు మొత్తం 20 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పెద్దసంఖ్యలో పశుమరణాలు సంభవిస్తుండటం, వాటి ఖననాలకూ రైతుల వద్ద డబ్బు లేకపోవడం, ఎల్ఎస్‌డీని మహమ్మారిగా ప్రభుత్వం ప్రకటించకపోవడం, తమకు ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంపై అన్నదాతలు ఆగ్రహంగా ఉన్నారు

ఈడీ ఎదుట కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే

దిల్లీ: మనీలాండరింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ సోమవారం దిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో హాజరయ్యారు. ఏపీజే అబ్దుల్‌కలాం రోడ్డులో ఉన్న ఈడీ కార్యాలయానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకున్న శివకుమార్.... గేట్ వద్ద కౌంటర్‌లో తనకు అందిన నోటీసు చూపించి కార్యాలయంలోకి వెళ్లారు. మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఈడీ గతవారం ఆయనకు సమన్లు జారీచేసింది. అయితే, అవి ఏకేసుకు సంబంధించినవో తెలియదని శివకుమార్ చెబుతున్నారు. అయితే ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలపై సీబీఐ నమోదు చేసిన కేసులోనే ఈడీ సమన్లు జారీ చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తోన్న భారత్ జోడో యాత్రతోపాటు ప్రస్తుతం కర్ణాటక అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న వేళ...ఈడీ సమన్లు జారీచేయడంపై శివకుమార్ అసంతృప్తి వ్యక్తంచేశారు. విచారణకు సహకరించేందుకు తాను సిద్ధంగానే ఉన్నప్పటికీ కీలక సమయంలో ఇటువంటి వేధింపుల వల్ల తన రాజ్యాంగ, రాజకీయపరమైన విధుల నిర్వహణకు ఆటంకం కలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఈడీ సమన్ల నేపథ్యంలో దిల్లీలోని దర్యాప్తు కార్యాలయంలో హాజరైనట్లు తెలిపారు. మరోవైపు, మరో మనీలాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న డీకే శివకుమార్... 2019 సెప్టెంబర్ 3న అరెస్టు అయ్యారు. ఆ ఏడాది అక్టోబర్‌లో దిల్లీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో శివకుమార్ తదితరులు పన్ను ఎగవేసేందుకు ప్రయత్నించారంటూ ఐటీ అధికారులు బెంగళూరు కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. అందులో డీకే శివకుమార్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు.

మైన్మార్‌లో భారత కార్మికులను రక్షించండి
ప్రధాని మోదీకి సీపీఐ విజ్ఞప్తి

చెన్నై : మైన్మార్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసి తమిళనాడుకు చెందిన కార్మికులను వెట్టిచాకిరీలోకి నెట్టారని, వారిని రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కోరింది. థాయ్‌లాండ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తప్పుడు వాగ్దానం చేసిన తర్వాత, తమిళనాడు కార్మికులను అసాంఘిక శక్తులు మైన్మార్‌లోని మైవాడికి తీసుకువెళ్లి, అక్కడ వారిని వెట్టిచాకిరీలోకి నెట్టారని సామాజిక మాధ్యమాలను ఉటంకిస్తూ పార్టీ తెలిపింది. మైన్మార్‌లో ఇటువంటి కార్మికులు చిత్రహింసలను ఎదుర్కొన్నారని, స్వదేశానికి తిరిగి వచ్చిన వారి కుటుంబాలు చితికిపోయాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, అలాగే కేంద్రం వారికి దేశీయ ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ప్రజలను మోసం చేయడంతో కార్మికులు విదేశాల్లో ఉపాధి వెతుక్కోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా
చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి
దిల్లీ మహిళా కమిషన్

న్యూదిల్లీ: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని దిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) కోరింది. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కారం) చట్టం అమలులో అనేక 'లోపాలను' ఎత్తి చూపుతూ నగర ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది. ప్రతి జిల్లాలో స్థానిక ఫిర్యాదుల కమిటీ (ఎల్‌సీసీ) రాజ్యాంగం, సరైన పనితీరును చట్టం నిర్దేశిస్తుంది. 10 మంది కంటే తక్కువ మంది కార్మికులు ఉన్నందున 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'ని ఏర్పాటు చేయని సంస్థల నుంచి లైంగిక వేధింపుల ఫిర్యాదులను కమిటీలు స్వీకరిస్తాయి లేదా ఫిర్యాదు యజమానిపైనే ఉంటుంది. దేశ రాజధానిలో ఎల్‌సీసీ స్థితిని నిర్ధారించడానికి, డీసీడబ్ల్యూ వారి సంబంధిత జిల్లాల్లోని ఫిర్యాదు కమిటీకి సంబంధించి నిర్దిష్ట సమాచారం కోరుతూ దిల్లీలోని అన్ని జిల్లాల మేజిస్ట్రేట్‌లకు నోటీసులు జారీ చేసింది. 2019 నుంచి 2021 వరకు అన్ని ఎల్‌సీసీలకు 40 ఫిర్యాదులు మాత్రమే అందాయని గుర్తించారు. ఉదాహరణకు, గత మూడేళ్లలో నైరుతి జిల్లా కేవలం మూడు కేసులను మాత్రమే నిర్వహించింది. పశ్చిమ జిల్లా ఎలాంటి కేసులను నిర్వహించలేదని ప్యానెల్ పేర్కొంది. తక్కువ సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులను కూడా సమయానుకూలంగా పరిష్కరించడం లేదని తెలిపింది. ఈ కమిటీల చైర్‌పర్సన్‌లను సామాజిక కార్యరంగంలో ప్రముఖ మహిళల్లో నామినేట్ చేయాలని చట్టం ఆదేశించినప్పటికీ, చాలా జిల్లాలు దీనిని అనుసరించడం లేదని, చాలా జిల్లాల్లో ప్రఖ్యాత ఎన్‌జీవోల నుంచి బయటి సభ్యులు లేరని పేర్కొంది. కమిటీలకు సరైన ప్రత్యేక కార్యాలయ స్థలం, బడ్జెట్, సిబ్బందిని అందించలేదని ప్యానెల్ పేర్కొంది. ఈ కమిటీల ఉనికి గురించి ప్రచారం లేకపోవడాన్ని కూడా నివేదిక ప్రత్యేకంగా పేర్కొంది. డీసీడబ్ల్యూ దిల్లీ ప్రజలందరికీ ప్రాప్యతను పెంచడానికి ఆన్‌లైన్‌లో అలాగే ఆఫ్‌లైన్‌లో సమర్థవంతమైన ఫిర్యాదుల స్వీకరణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. తక్కువ సంఖ్యలో ఫిర్యాదులు నమోదు కావడానికి ఎల్‌సీసీ, పని ప్రదేశాల వద్ద మహిళలపై లైంగిక వేధింపుల చట్టం, 2013లోని ఇతర నిబంధనలపై అవగాహన లేకపోవడం కూడా కారణమని పేర్కొంది. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా, చట్ట నిబంధనల పై రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ప్రజల్లో అవగాహన పెంచాలని కమిషన్ సిఫార్సు చేసింది.

'రాజధానిలో పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా చట్టం అమలులో ఉన్న పరిస్థితి విచారకరం. మేము దిల్లీ ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఒక వివరణాత్మక నివేదికను అందించాము. దీనిపై తక్షణ చర్యను ఆశిస్తున్నాము' అని డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్ తెలిపారు.

కశ్మీరీ పండిత్‌ల మారణహోమంపై
దర్యాప్తునకు సుప్రీం తిరస్కృతి

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదం ఉధృతంగా ఉన్న సమయం...1989-90 మధ్యకాలంలో 700 మందికి పైగా కశ్మీరీ పండిత్‌ల హత్యకు గురవడం, ఇతర నేరాలకు సంబంధించి వేర్పాటువాద నాయకుడు యాసిన్ మాలిక్ సహా ఇతరులపై దర్యాప్తు, విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. దాదాపు 27 ఏళ్లు గడిచిపోయాయి... కశ్మీరీ పండిత్‌లు లోయ నుంచి ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తున వలస వెళ్లేందుకు కారణమైన హత్యలు, దహనం, దోపిడీ కేసుల్లో సాక్ష్యాలను సేకరించడం చాలా కష్టమని జస్టిస్ జేఎస్ ఖేహర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'మీరు (పిటిషనర్) గత 27 సంవత్సరాలుగా దానిపై మాట్లాడకుండా కూర్చున్నారు. ఇప్పుడు ఆధారాలు ఎక్కడి నుండి వస్తాయో మాకు చెప్పండి' అని ధర్మాసనం ప్రశ్నించింది. 'రూట్స్ ఆఫ్ కశ్మీర్' అనే సంస్థ ఈ పిటిషన్ దాఖలు చేసింది. దాని తరపు న్యాయవాది వికాస్ పడోరా మాట్లాడుతూ... కశ్మీరీ పండిట్‌లు లోయలోని తమ నివాసాలను విడిచిపెట్టాల్సి వచ్చినందున విచారణలో చేరలేకపోయారన్నారు. జాప్యం జరిగింది కానీ కేంద్రం ,రాష్ట్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కానీ ఏదీ కూడా తగిన విధంగా స్పందించలేదన్నారు. 700 మందికి పైగా కశ్మీరీ పండిత్‌ల హత్యలకు సంబంధించి 215 ప్రథమ సమాచార నివేదికలు (ఎఫ్ఐఆర్‌లు) నమోదయ్యాయని, ఏ ఒక్క కేసు దర్యాప్తు కూడా ముగింపుకు రాలేదని సంస్థ ఆరోపించింది. కశ్మీరీ పండిట్‌లు 1990ల ప్రారంభంలో ఉగ్రవాదం ఉధృతంగా ఉన్న సమయంలో తీవ్రమైన బెదిరింపులు, దాడుల నడుమ లోయను వీడి పారిపోవలసి వచ్చింది.

పాఠశాలల్లో హిందుత్వ ఎజెండా అమలు
మెహబూబా ముఫ్తీ మండిపాటు

శ్రీనగర్ : కాశ్మీర్‌లో బీజేపీ ప్రభుత్వం హిందుత్వ ఎజెండాను అమలు చేస్తోందని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు. రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో హిందూ మతానికి చెందిన కీర్తనలు పాడమని విద్యార్థులను అధికారులు ఆదేశించడమే ఇందుకు నిదర్శనమని సోమవారం ట్వీట్ చేశారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలోని తమ అనుకూల ప్రభుత్వం ద్వారా అసలు సిసలైన హిందుత్వ ఎజెండాను అమలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర మతాల పండితులను జైళ్లలో పెట్టడం, జామా మసీదును మూసివేయడం, పాఠశాల విద్యార్థులచే హిందూ మతానికి చెందిన కీర్తనలను ఆలపించేలా ఆదేశాలు ఇవ్వడం వంటి చర్యలు హిందుత్వ ఎజెండాను బహిర్గతం చేస్తున్నాయని పేర్కొంటూ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఒక తరగతి గదిలో రఘుపతి రాఘవ రాజారాం అనే హిందుమతానికి చెందిన కీర్తనను ఆలపిస్తున్న వీడియోను పోస్టు చేశారు.

ప్రశ్నించే హక్కు లేదా ?
రాజస్థాన్ అసెంబ్లీలో ప్రతిపక్షాల ఆందోళన

జైపూర్ : కాంగ్రెస్ పాలిత రాజస్థాన్ అసెంబ్లీలో ప్రశ్నించే హక్కుకు భంగం కలుగుతోందంటూ ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి. మార్చి 28న వాయిదా పడ్డ అసెంబ్లీ సమావేశాలకు కొనసాగింపుగా సోమవారం అసెంబ్లీని సమావేశాన్ని నిర్వహించడాన్ని బీజేపీ, ఆప్ సహా ఇతర ప్రతిపక్షాలు తప్పుబట్టాయి. కొత్తగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించకుండా గత సమావేశాలకు కొనసాగింపుగా అసెంబ్లీని నిర్వహించడం ఏమిటని ప్రశ్నించాయి. సభలో అడిగే ప్రశ్నలకు సంబంధించి కోటా పూర్తయిన ఎమ్మెల్యేలకు మళ్లీ ప్రశ్నించే అవకాశం ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళం సృష్టించాయి. బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టడంతో స్పీకర్ సీపీ జోషి తొలుత 15 నిముషాలు సభను వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మరోసారి వెల్‌లోకి దూసుకెళ్లడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అయినా స్పీకర్ సభను కొనసాగించే ప్రయత్నం చేశారు. మృతి చెందిన నేతలకు నివాళులు అర్పించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాల తీరుపై స్పందించిన బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత గులాబ్ చంద్ కటారియా మాట్లాడుతూ సభలో ప్రశ్నించే హక్కును కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. సభవాయిదా అనంతరం కూడా స్పీకర్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

కాళీనదిపై వంతెనకు సీఎం శంకుస్థాపన

పితోర్‌గఢ్: భారత్, నేపాల్ మధ్య ప్రవహించే కాళీ నదిపై వంతెనకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి సోమవారం ఇక్కడ శంకుస్థాపన చేశారు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. 110 మీటర్ల పొడవైన వంతెన 10.50 మీటర్ల వెడల్పు, 7.5 మీటర్ల క్యారేజ్‌వేతో రెండువైపులా ఫుట్‌పాత్‌లను కలిగి ఉంటుంది. చండీగఢ్‌కు చెందిన సంస్థ రూ.32.98 కోట్ల వ్యయంతో 12 నెలల్లో వంతెనను నిర్మిస్తుందని పీడబ్ల్యూడీ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆనంద్ బల్లాభ్ కంద్‌పాల్ తెలిపారు. "బ్రిడ్జి రూపకల్పనను ఐఐటీ దిల్లీకి చెందిన నిపుణుల బృందం ఆమోదించింది, కొన్ని నెలల క్రితం భారత్-నేపాల్ అధికారులతో కలిసి స్థలాన్ని సందర్శించారు" అని అధికారి తెలిపారు. ఈ వంతెన నిర్మాణం వల్ల రెండు దేశాల మధ్య వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయి. నేపాల్‌కు వెళ్లేందుకు ప్రజలు చంపావత్ జిల్లాలోని బన్‌బాసా వరకు వెళ్లాల్సి వచ్చేది. పాదచారుల కోసం ఉద్దేశించిన ఎనిమిది సస్పెన్షన్ బ్రిడ్జిలతో పాటు జిల్లాలో భారత్-నేపాల్‌లను కలిపే మొదటి మోటారు వంతెన ఇదేనని పిథోరఘర్ జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ చౌహాన్ తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా... 174 మంది అరెస్ట్

చెన్నై: రూ.27 లక్షల విలువైన 4వేల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా, 174 మందిని అరెస్టు చేసినట్లు తమిళనాడు ప్రభుత్వం సోమవారం తెలిపింది. రేష్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా వారం రోజుల్లో (సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు) 4,813 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశామని, ఈ బియ్యం విలువ రూ. 27.21 లక్షలుగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. బియ్యం అక్రమ రవాణాకు యత్నించిన 54 వాహనాలను సీజ్ చేయగా, 174 మందిని అరెస్టు చేశారు. బ్లాక్ మార్కెటింగ్ నిరోధక, నిత్యావసర వస్తువుల సరఫరాల నిర్వహణ చట్టం, 1980 ప్రకారం నేరస్తులను అరెస్ట్ చేసినట్టు పేర్కొంది.

చండీగఢ్ వర్సిటీ కేసు విచారణకు సిట్ ఏర్పాటు

చండీగఢ్: చండీగఢ్ విశ్వవిద్యాలయానికి చెందిన అనేక మంది విద్యార్థినుల అభ్యంతరకర వీడియోలను తోటి విద్యార్థిని రికార్డు చేసిందన్న ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన మహిళా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పంజాబ్ పోలీసులు సోమవారం తెలిపారు. సీనియర్ ఐపీఎస్ అధికారి గురుప్రీత్ కౌర్ దేవ్ పర్యవేక్షణలో సిట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ బృందం ఈ కేసును క్షుణ్ణంగా విచారణ చేస్తుందని, ప్రమేయం ఉన్న ఏ వ్యక్తిని విడిచిపెట్టబోమని పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గౌరవ్ యాదవ్ తెలిపారు. 'పరిశోధనలు పూర్తి వేగంతో కొనసాగుతున్నాయి' అని అన్నారు. కాగా ఈ కేసులో విద్యార్థిని సహా ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యాలను కాపాడాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. 'లేనిపోని వదంతుల జోలికి వెళ్లవద్దు... సమాజంలో శాంతి నెలకొనేందుకు కలిసికట్టుగా కృషి చేద్దాం' అని అన్నారు. పంజాబ్‌లోని మొహాలిలోని విశ్వవిద్యాలయం ఆవరణలో శనివారం రాత్రి నుంచి నిరసనలు చెలరేగాయి. అవి సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి.

సంజయ్‌రౌత్ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

ముంబై: శివసేన ఎంపీ సంజయ్ రౌత్ జ్యుడిషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. మనీలాండరింగ్ కేసులో నిందితుడిగా పేర్కొన్న అనుబంధ ఛార్జిషీట్‌ను సోమవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు విచారించింది. ముంబైలోని గోరేగావ్ ప్రాంతంలోని పత్రా చాల్ (రో టెన్‌మెంట్) రీ డెవలప్‌మెంట్‌లో ఆర్థిక అవకతవకలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆగస్టు 1న రాజ్యసభ సభ్యుడు రౌత్ (60)ను అరెస్టు చేసింది. ఈ కేసులో రౌత్‌ను నిందితుడిగా పేర్కొంటూ ఈడీ గత వారం అనుబంధ ఛార్జిషీటును దాఖలు చేసింది. రౌత్ బెయిల్ కోసం మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ప్రాసిక్యూషన్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి ఎంజీ దేశ్‌పాండే, సేన ఎంపీ సహాయకుడు ప్రవీణ్ రౌత్‌తో సహా ఈ కేసులోని నిందితులందరికీ సమన్లు జారీ చేశారు. సంజయ్ రౌత్ జ్యుడిషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగిస్తూ సోమవారం కోర్టు తీర్పునిచ్చింది. ఛార్జ్‌షీట్‌ను పరిశీలించి, అతని పిటిషన్‌లో అదనపు కారణాలను జోడించడంపై నిర్ణయం తీసుకోవాలని అతని తరపు న్యాయవాది చెప్పడంతో సంజయ్ రౌత్ బెయిల్ విచారణ సెప్టెంబర్ 21కి వాయిదా పడింది.

రాహుల్ అధ్యక్ష బాధ్యతల్ని చేపట్టాలి
తమిళనాడు పీసీసీ తీర్మానం

చెన్నై : కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతల్ని స్వీకరించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ రాహుల్ గాంధీని కోరింది. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ అళగిరి పార్టీ అధ్యక్ష బాధ్యతల్ని స్వీకరించి పార్టీని నడిపించాలని రాహుల్ గాంధీని కోరుతూ చేసిన ప్రతిపాదనను కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ విషయాన్ని టీఎన్‌సీసీ ట్విట్టర్ వేదికగా పంచుకుంది. ఇదిలా ఉండగా ఇప్పటికే రాహుల్ గాంధీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని చేపట్టాలని కోరుతూ గుజరాత్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ సహా వివిధ రాష్ట్రాల కమిటీలు తీర్మానాలు చేసిన విషయం తెలిసిందే.

ఉద్యోగులు, పింఛనర్లకు కరువుభత్యం పెంపు

భువనేశ్వర్: ఒడిశా ప్రభుత్వం ఉద్యోగులు, పింఛనర్లకు మూడు శాతం కరువు భత్యం పెంచుతున్నట్టు సోమవారం ప్రకటించింది. 2022 జనవరి 1 నుంచి అమలులోకి వచ్చే 31 శాతం నుంచి 34 శాతానికి పెంచే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదం తెలిపారు. నాలుగు లక్షలమంది ఉద్యోగులు, 3.5 లక్షల మంది పింఛనుదారులు లబ్ధిపొందనున్నారు. జనవరి నుంచి ఆగస్టు వరకు ఉన్న ఎరియర్స్‌ను విడిగా ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది.

భజరంగ్, వినేశ్ ఆటతీరుపై మోదీ ప్రశంసలు

న్యూదిల్లీ: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో రెజ్లర్లు భజరంగ్ పునియా, వినేశ్ ఫోగట్‌ల ప్రదర్శనను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రశంసించారు. వారికి అభినందనలు తెలిపారు. ఆదివారం బెల్‌గ్రేడ్‌లో జరిగిన ప్రస్తుత ఎడిషన్‌లో కాంస్యం సాధించడం ద్వారా ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు సాధించిన ఏకైక భారతీయుడిగా భజరంగ్ పునియా నిలిచాడు.

వినేశ్ ఫోగట్ గత వారం బెల్‌గ్రేడ్‌లో 53 కిలోల కాంస్యం సాధించి రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలను గెలుచుకున్న మొదటి భారతీయ మహిళా రెజ్లర్‌గా నిలిచింది. 'రెజ్లర్లు మాకు గర్వకారణం. బెల్‌గ్రేడ్‌లో జరిగిన ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియాలకు అభినందనలు' అని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. "ఈ ప్లాట్‌ఫారమ్‌పై రెండు పతకాలు సాధించిన మొదటి భారతీయ మహిళగా వినేశ్, 4వ పతకాన్ని భజరంగ్ గెలుచుకోవడంతో ఇది ఇద్దరికీ ప్రత్యేకమైనది" అని ప్రధాని చెప్పారు.

వివాదంలో పంజాబ్ సీఎం

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు సంబంధించి ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన ఫ్రాంక్‌ఫర్ట్ నగరం నుంచి దిల్లీకి వచ్చేందుకు లుఫ్తాన్సా విమానయాన సంస్థకు చెందిన విమానం ఎక్కారని, అయితే.. ఆయన పీకల దాకా మద్యం సేవించడంతో విమానం నుంచి ఆయనను దించేశారని విపక్షాలు విమర్శలకు దిగాయి. అయితే.. ముఖ్యమంత్రి కార్యాలయం ఈ ఆరోపణలపై స్పందిస్తూ.. ఆయన ఆరోగ్యంగా లేకపోవడం వల్లే ఆలస్యంగా దిల్లీకి తిరిగి వచ్చారని తెలిపింది. పంజాబ్ సీఎం పూటుగా తాగడంతో విమానంలో ప్రయాణించేందుకు నిరాకరించారనే ప్రచారంపై ఆమ్ ఆద్మీ పార్టీ విపక్షాలకు కౌంటర్ ఇచ్చింది. ఇదంతా కేవలం దుష్ప్రచారమేనని కొట్టిపారేసింది. అనుకున్న సమయం ప్రకారం విమానం బయల్దేరలేదని, ఆలస్యం అయిన మాట వాస్తవమేనని.. ఆలస్యానికి కారణం ఈ విమానానికి అనుబంధం ఉన్న మరో విమానం ఆలస్యంగా రావడమేనని లుఫ్తాన్సా వివరణ ఇచ్చినట్టుగా ఆప్ చెప్పుకొచ్చింది. విమానం ఆలస్యం అవడంపై సదరు విమానయాన సంస్థ లుఫ్తాన్సా ఇచ్చిన వివరణను ఆప్ షేర్ చేసింది. అయితే.. ఇదే ఎయిర్‌లైన్స్ వివరణలో మరో అంశాన్ని కూడా స్పష్టం చేసింది. ప్రయాణికుల డేటాకు భద్రత కల్పించే దృష్ట్యా ఏ ఒక్క ప్రయాణికుడికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్నీ వెల్లడించలేమని తెలిపింది.

ఈ వివరణ కూడా ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది. అయితే.. విపక్షాలు మాత్రం భగవంత్ మాన్ ఫుల్లుగా తాగి చేసిన రచ్చ వల్లే నాలుగు గంటలు ఆలస్యమైందని ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారం అటు పంజాబ్‌తో పాటు ఇటు దిల్లీలో కూడా రాజకీయంగా పెను దుమారం రేపింది. అకాలీ దళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ట్విట్టర్‌లో మాన్‌పై విమర్శలు చేశారు. లుఫ్తాన్సా విమానం నుంచి పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను దింపేశారని.. ఆయన ఫుల్లుగా తాగొచ్చి నడవడానికి కూడా ఇబ్బందిపడ్డారని.. ఈ పరిణామం విమానం నాలుగు గంటలు ఆలస్యం కావడానికి కారణమైందని అదే విమానంలో ఉన్న తోటి ప్రయాణికులు చెప్పినట్టుగా అకాలీ దళ్ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ట్వీట్ చేశారు. ఆప్ జాతీయ సదస్సుకు కూడా భగవంత్ మాన్ ఎగ్గొట్టిన పరిస్థితి ఉందని.. పంజాబ్ సీఎంకు సంబంధించి బయటికొచ్చిన ఈ వార్తలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పంజాబీలు సిగ్గుతో తలదించుకునేలా చేశాయని, మాన్ పంజాబీల పరువు తీశారని ట్వీట్‌లో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ విమర్శించారు.

దిల్లీ కాంగ్రెస్ కూడా పంజాబ్ ముఖ్యమంత్రి పూటుగా మద్యం సేవించి విమానం ఎక్కడంతో దింపేశారని, సిగ్గుపడాల్సిన పరిణామమని ట్వీట్ చేసింది. ఆప్ అధికార ప్రతినిధి మల్వీందర్ సింగ్ కంగ్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 19న షెడ్యూల్ ప్రకారమే ముఖ్యమంత్రి తిరిగి వచ్చారని.. సోషల్ మీడియాలో వస్తున్నవన్నీ వదంతులేనని చెప్పారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సెప్టెంబర్ 11 నుంచి 18 వరకూ పెట్టుబడులను ఆకర్షించే దృష్ట్యా జర్మనీలో ఉన్నారు.



మిత్రులు లేకపోవడం బాధే.
కానీ శత్రువులు లేకపోవడం
అంతకన్నా దారుణం.

- చేగువేరా

కమ్యూనిస్టు కాకాబాబు

భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ఒకరైన ముజఫర్ అహ్మద్ (1889 ఆగస్టు 5 - 1973 డిసెంబరు 18)ను పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఆప్యాయంగా కాకాబాబు (బాబాయి) అని పిలిచేవారు. జీవన విధానం, పనితీరు ద్వారా ఆయన సహచరులకు ఆదర్శంగా నిలిచారు. తన 60 సంవత్సరాల రాజకీయ జీవితంలో 52 ఏళ్లు పార్టీ పూర్తికాల కార్యకర్తగా గడిపారు. శ్రామికవర్గ అంతర్జాతీయవాదం పట్ల ఆయనకున్న ప్రగాఢ అనురక్తి, ప్రజాస్వామ్యంపై దృఢ విశ్వాసం, స్త్రీల సమాన హక్కుల పట్ల అపారమైన గౌరవం కలిసి ఆయన్ని గొప్ప విప్లవకారుడిగా మార్చాయి. అహ్మద్‌కు పార్టీ, ప్రజా ఉద్యమాలు, ఎన్నికల పోరాటాలు మొదలైన వాటిపై స్పష్టమైన భావనలు ఉన్నాయి. ఆయన ఎన్నికల ప్రచార పద్ధతులను నిశితంగా అనుసరించారు 1937 నుంచి 1971 వరకు ప్రతి ఎన్నికలలో క్రియాశీల నాయకత్వాన్ని అందించారు.

అజ్ఞాతవాసంలో అనుసరించాల్సిన పద్ధతులు, నియమాలపై ఇతర నాయకులకు ముజఫర్ అహ్మద్ ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పార్టీ నిర్మాణం, ఉద్యమాల కోసం ఎనిమిదేళ్ల వ్యవధిలో దాదాపు ఐదు పర్యాయాలు అజ్ఞాతంలోకి వెళ్లారు. జైలులో ఉన్నప్పుడే 1933 డిసెంబరులో కలకత్తాలో జరిగిన ఆల్ ఇండియా డెలిగేట్స్ కాన్ఫరెన్స్‌లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1948లో జరిగిన పార్టీ రెండో మహాసభలో మినహా ప్రతి పార్టీ మహాసభలోనూ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. అంతర్జాతీయంగా ఆయన శ్రామిక వర్గ పక్షపాతి. బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమం గురించి గర్వపడ్డారు. పత్రికా స్వేచ్ఛ, వాక్‌స్వాతంత్ర్యం అవసరమని ప్రగాఢంగా విశ్వసించిన వ్యక్తి ముజఫర్. రైతుల సమస్యలపై, సమకాలిన రాజకీయాలపై ఆయన చేసిన రచనలు ఎందరినో ఉత్తేజపరిచాయి.

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ జిల్లా మౌసాపూర్ గ్రామంలో 1889 ఆగస్టు 5న ముజఫర్ అహ్మద్ జన్మించారు. ఆయన జర్నలిస్టుకూడా. ముజఫర్ అహ్మద్ ఇంటర్మీడియట్


ముజఫర్ అహ్మద్

విద్యార్థిగా ఉండగా మొదట హుగ్లీ కళాశాలలో, తరువాత బంగాబాసి కళాశాలలో, రైటర్స్ బిల్డింగ్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత హోం శాఖలో అనువాదకునిగా పనిచేశారు. అదే సమయంలో ఆయన బంగియా ముస్సల్మాన్ సాహిత్య సమితికి సహాయ కార్యదర్శిగా ఉన్నారు. 1920లో ఖాజీ నజ్రుల్ ఇస్లాంతో కలిసి నబా జగ్ అనే కొత్త పత్రికను ప్రారంభించారు. ఆ తరువాత 1922లో ధూమ్కేతు అనే మరో పత్రికను నజ్రుల్ ప్రారంభించినప్పుడు "ద్వైపాయన" అనే కలంపేరుతో రాసేవారు. 1916 నుంచి ముజఫర్ అహ్మద్ రాజకీయ సమావేశాలు, ఊరేగింపులలో పాల్గొనడం ప్రారంభించారు. 1920లో రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయాన్ని ఏర్పరచుకుని విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పేపర్లు, పత్రికలను సేకరించడం ప్రారంభించాడు. పార్టీ మొదటి ప్రచురణ అయిన ది వాన్గార్డ్ ఆఫ్ ది ఇండియన్ ఇండిపెండెన్స్, 1922 మే 15న వెలువడింది. 1922 చివరిలో అబ్దుల్ హలీమ్‌ను ముజఫర్ కలుసుకున్నారు. ఆయనతో కలిసి భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మించే కర్తవ్యాన్ని బుజానకెత్తుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ పూర్తిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ శాఖగా పని చేయడం ప్రారంభించాక ముజఫర్ అహ్మద్ కార్మికవర్గ ఉద్యమాలలో భాగస్వామి అయ్యారు. ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో చేరారు.

ఆయన రాజకీయ జీవితంలో మొత్తం ఇరవై ఏళ్లు జైళ్లలో గడపాల్సి వచ్చింది. స్వాతంత్ర్యానంతర కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అనేకసార్లు జైలుకెళ్లారు. జైలులో ఉన్నప్పుడు, రాజకీయ ఖైదీల కోసం రెండుసార్లు సుదీర్ఘ నిరాహార దీక్షలు చేశాడు. 1947లో దేశ విభజన తర్వాత అహ్మద్ తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్)లో ఉండకుండా కలకత్తాకు మారాడు. 1948 మార్చి 25న కమ్యూనిస్టు పార్టీని భారత ప్రభుత్వం నిషేధించినప్పుడు అహ్మద్‌ని జైలులో పెట్టారు. 1951లో విడుదలయ్యారు. కాన్పూర్ బోల్షవిక్ కుట్ర కేసులో ఎస్ఏ డాంగే, నళిని గుప్తా, షౌకత్ ఉస్మానితో పాటు ఆయనను కూడా అరెస్టు చేసి నాలుగేళ్లు జైలులో ఉంచారు. అనారోగ్య కారణాలతో 1925లో జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తరువాత 1925 నవంబరులో ఖాజీ నజ్రుల్ ఇస్లాం, హేమంత కుమార్ సర్కార్, ఇతరులతో కలిసి కలకత్తాలో లేబర్ స్వరాజ్ పార్టీని ఏర్పాటుచేశారు. 1920వ దశకం ప్రారంభంలో అబ్దుల్ హలీం, అబ్దుర్ రజాక్ ఖాన్‌తో పాటు సీపీఐ ప్రధాన నాయకునిగా ముజఫర్ అహ్మద్ ఉన్నారు. 1929 మార్చి 20న బ్రిటిష్ వలస ప్రభుత్వం 31 మందిని అరెస్టు చేసి విచారణ కోసం మీరట్‌కు పంపింది. వారిలో అహ్మద్ ప్రధాన నిందితుడు. మీరట్ కుట్ర కేసులో అహ్మద్ అత్యధిక కాలం జైలు శిక్ష అనుభవించాడు. ముజఫర్ అహ్మద్ తన 84వ ఏట 1973 డిసెంబర్ 18న కన్నుమూశారు.

- మోదుమూడి మురళీకృష్ణ

అధ్యయనం చూపిన ఎర్రబాట

అధ్యయనాన్ని మించిన ఆయుధం లేదు అన్న మాట పుచ్చలపల్లి సుందరయ్య (1913 మే 1, 1985 మే 19)కు వర్తించినట్టు చాలా తక్కువ మందికే వర్తిస్తుంది. ఏడెనిమిదేళ్ల వయసులోనే సుందరయ్య దృష్టి పుస్తకాలు చదవడం మీదకు మళ్లింది. ఆయనకు ట్యూషన్ చెప్పిన వెంకతరత్నం ప్రభావంవల్ల తెలుగు భాష మీద అభిమానం పెరిగింది. భోగరాజు నారాయణ మూర్తి "విమలాదేవి", "రాయచూరు యుద్ధం", "తిమ్మరుసు" లాంటి చారిత్రక గ్రంథాలు చదవడంతో సుందరయ్యలో స్వాతంత్ర్య యోధుల మీద శ్రద్ధ పెరిగింది. వేమన పద్యాలు, సుమతీ శతకం కంఠస్థం చేయడంతో సమానత్వ భావన అంకురించింది.

తండ్రి చిన్నప్పుడే మరణించడంతో సుందరయ్య సెషన్స్ జడ్జీగా ఉన్న బావగారి దగ్గర ఉండి చదువుకున్నారు. అప్పుడే పందిరి మల్లికార్జున రావు సలహా మేరకు కొమర్రాజు లక్ష్మణ రావు, చిలుకూరి వీరభద్ర రావు, వీరేశలింగం, చిలకమర్తి గ్రంథాలు అధ్యయనం చేశారు. చిత్తరంజన్ దాస్ మరణ వార్త తెలిసి కాంగ్రెస్, జాతీయ పోరాటం గురించి తెలుసుకున్నారు. జలియన్వాలా బాగ్ ఉదంతం సుందరయ్యలో బ్రిటిష్ పాలన మీద ఏవగింపు పెంచింది. అందుకే 1925లోనే ఒక వ్యక్తిగత విప్లవ బృందంలో చేరారు. తిలక్ గీతా రహస్యం సుందరయ్యకు కర్తవ్య బోధ చేసింది. అధ్యయనమే ఆయనను ఎర్రబాట పట్టించింది.

ఆదర్శాలను అమలు చేయడంలో ఎవరైనా సుందరయ్య తరవాతే. మనుషుల మీద అపారమైన అభిమానం చూపే వారు. మనిషిని ప్రేమించని వాళ్లు కమ్యూనిస్టులు కాలేరు అని సుందరయ్య జీవితాన్ని పరిశీలిస్తే అర్థం అవుతుంది.

1929లో మద్రాసులో ఇంటర్

పుచ్చలపల్లి సుందరయ్య

చదువుతున్నప్పుడు కొంతమంది తెలుగు విద్యార్థులతో కలిసి సోదర సమితి ఏర్పాటు చేశారు. అప్పుడే కమ్యూనిస్టు ప్రణాళిక, కూలీ, పని-పెట్టుబడి, యంగ్ లిబరేటర్ పత్రిక లాంటి మార్క్సిస్టు సాహిత్యం ఆకళింపు చేసుకున్నారు. ఆయన ఎంతటి ఆచరణవాది అంటే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు సెలవుల్లో నెల్లూరు జిల్లాలోని సొంతూరు అలగాని పాడు వెళ్లినప్పుడు అవర్ణులకు, సవర్ణులకు పంక్తి భోజనం ఏర్పాటు చేశారు. భీమవరం వెళ్లి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అప్పటికాయనకు 17 ఏళ్లే. రెండేళ్లు జైలు శిక్ష విధించి బాలనేరస్థుల్ని నిర్బంధించే చోటికి పంపారు. అక్కడ దుర్భర పరిస్థితులపై తిరగబడ్డారు. నిరాహార దీక్ష చేశారు.

రాజమండ్రి జైలులో ఉన్నప్పుడు లాహోరు కుట్రకేసు నిందితులు, సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీకి చెందిన విజయకుమార్ సిన్ హా (భగత్ సింగ్ అనుచరుడు) మొదలైన వారితో పరిచయం అయింది. చదివిన గ్రంథాల ప్రభావంవల్ల ఆయనలో జాతీయ సమరంలో దూకాలన్న పట్టుదల పెరిగి చదువు మానేశారు. అమీర్ హైదర్ ఖాన్ తో పరిచయంతో సుందరయ్య కమ్యూనిస్టుగా మారారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణావకాశాలను అన్వేషిస్తూ 1933-34లో ఆంధ్ర ప్రాంతమతా తిరిగారు. శాసనోల్లంఘన సమయంలోనే గాంధీజీ నాయకత్వంపై ఆయనలో నిరాశ మిదలైంది. కాలెజీ విద్యార్థిగా ఉన్నప్పుడే సుందరయ్య కమ్యూనిస్టుగా మారారు.

వ్యవసాయ విప్లవంపై ఆయన భావాలు విశిష్టమైనవి. తెలంగాణ సాయుధ పోరాటంతో సంబంధం సుందరయ్య మీద సానుకూల ప్రభావం చూపింది. ప్రజాస్వామ్య విలువలను సాధించడానికి రైతుల పాత్ర ఏమిటో ఆయన నిర్ణయించుకున్నారు. గ్రామాలలో విప్లవ కేంద్రాలు ఉండాలనుకున్నారు. వ్యావసాయిక విప్లవంవల్లే భూస్వామ్య వ్యవస్థ రద్దు సాధ్యం అనుకున్నారు. 22వ ఏటనే సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులయ్యారు. కమ్యూనిస్టు పార్టీ జాతీయ స్థాయిలో విస్తరిస్తున్న దశనుంచీ సుందరయ్య నాయకత్వ స్థాయిలోనే ఉన్నారు. పార్టీ నిర్మాణం విషయంలో సుందరయ్య ఎప్పుడూ విద్యార్థులు, యువత మీదే దృష్టి పెట్టే వారు. చరిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటానికి చంద్ర రాజేశ్వర రావుతో కలిసి సుందరయ్య మార్గదర్శక పాత్ర నిర్వహించారు. ఆ చరిత్రను విస్తారంగా గ్రంథస్థం చేశారు.

తెలంగాణ సాయుధ పోరాట విరమణ గురించి కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు, అంతర్జాతీయ పరిణామాలు 1964లో పార్టీ చీలికకు దారి తీశాయి. శుందరయ్య సీపీఎం వేపు వెళ్లి 1964 నుంచి 1976 దాకా సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్లమెంటు సభ్యుడిగా, శాసనసభ్యుడిగా ఆయన ప్రదర్శించిన శ్రద్ధ, అధ్యయనం, నైపుణ్యం భావి తరాలకు మార్గదర్శకం. తెలుగు మాట్లాడేవారందరూ ఒకే రాష్ట్రంగా ఉండాలన్న కమ్యూనిస్టుల భావనను సుందరయ్య "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" గ్రంథ రూపంలో అక్షరీకరించేట్టు చేసింది. అది ఎన్నటికైనా ప్రామాణికమైందే.

-భరద్వాజ

కయ్యూరు వీరులారా! లాల్ సలాం

బ్రిటీషు పాలకుల క్రూరత్వానికి, రైతుల వీరోచిత పోరాటానికి మరవలేని ఘట్టం. చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం వేళ్లూనుకుంటున్న కాలంలోనే నాటి బ్రిటీష్ ప్రభుత్వం తీవ్రమైన దమనకాండకు పాల్పడింది. భగత్‌సింగ్ తదితరుల బలి దానాన్ని ప్రజలు మరువక ముందే 1943 మార్చి 29 న నలుగురు రైతుల్ని ఉరి తీశారు. కేరళ-కర్నాటక సరిహద్దుల్లోని కాసరగోడ్ తాలూకాలోని ఒక గ్రామం కయ్యూరు. ఆ గ్రామంలో రైతులు నలుగురిని బ్రిటీష్ ముష్కరులు దారుణంగా ఉరి తీశారు. ప్రాణత్యాగం చేసిన వీరులు చిరుకండడు, పొడవకుఇంబు, మఠంఅప్పు, అబూబకర్‌లు కౌల్దారి రక్షణ కూడా లేని ఆ ప్రాంతంలో రైతు సభ ఏర్పాటు చేయటం, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతుల్ని కూడగట్టటం వీరు చేసిన నేరం.

భూసా ్వములకు సహాయంగా మలబార్ పోలీసులు రంగంలోకి దిగి దోపిడీలకు పాల్పడుతూ, అడ్డుకున్న ప్రజల్ని చితకబాదారు. ఒక స్త్రీ పట్ల అనుచితంగా ప్రవర్తించటంతో ప్రజలు ఎదురుతిరిగి పోలీసులపై రాళ్లు విసిరారు. ఈ రాళ్ల దాడిలో ఒక పోలీసు మృతి చెందాడు. భూస్వాములకు బలమైన ఆయుధం దొరికింది. పోలీసుని చంపారని రైతు నాయకులపై కేసు పెట్టారు. మంగుళూరు కోర్టులో విచారణ తంతు ముగించారు. పై నలుగురు వీరులకు ఉరిశిక్ష విధించారు. "వందలాది మంది పాల్గొన్న ఘటనలో చావుకు కారణమైన వారెవరు, ఎవరు కొట్టారో గుర్తించ టం కష్టం" అని అంగీకరిస్తూనే జిల్లా జడ్జి ఉరిశిక్ష విధించాడు. అప్పీలును హైకోర్టు తిరస్కరించింది. క్షమాభిక్ష కోసం శాసన సభ్యులు చేసిన విజ్ఞప్తి రాష్ట్రమంతా జరిగిన ఆందోళన గవర్నర్ మనసు కరిగించలేక పోయింది. బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ సహకారంతో లండన్ ప్రీవీకౌన్సిల్‌కి అప్పీలు చేశారు. ప్రఖ్యాత న్యాయవాది డీన్ ప్రిట్ సహాయం తీసుకున్నారు. చర్చి ప్రముఖుల చేత విజ్ఞప్తి చేయించారు. అన్నీ విఫలమయ్యాయి.

దేశ వ్యాపితంగా అన్ని భాషల్లో ప్రజలు రాసిన ఉత్తరాలు పెద్ద ప్యాకెట్ తీసుకొని పార్టీ అగ్ర నాయకులు పి.సి.జోషి, సుందరయ్య జైలులో వారిని కలిశారు. "ఈ ఉత్తరాలను చూస్తుంటే ఈ ప్రజలకు సేవ చేయటానికి ఎక్కువ కాలం జీవించలేకపోతున్నందుకుద బాధగా ఉంది" అని చిరుకండడు జోషితో అన్నాడట. ఉరితీసే ముందురోజు వారికి ఆ విషయం చెప్పారు. ఆ రాత్రంతా దేశభక్తి గీతాలు ఆలపిస్తూ గడిపారట. ఉరి తీసే సమయంలో కూడా కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలిచ్చారట. ఉరి తీసిన తర్వాత వారి భౌతిక కాయాల్ని తమకు అప్పగించాలని వేలాది మంది ప్రజలు జైలు దగ్గర కొచ్చారు గాని జైలు అధికారులు ఆ కోర్కెను మన్నించలేదు. కయ్యూరులో ఈ వీరుల జ్ఞాపకార్థం ఒక స్థూపం నిర్మించారు. వీరి గాథని 'చిరస్మరణ' పేరుతో కన్నడంలో నిరంజన రాసిన నవలను తిరుమల రామచంద్ర తెలుగులోకి అనువదించారు. ఇటీవల విశాలాంధ్ర పబ్లిషర్స్ వారు ఈ తెలుగు నవలను పునః ముద్రించారు. కయ్యూరు వీరులారా! వృథాపోదు మీ త్యాగం.

-చెరుకూరి సత్యనారాయణ



అలుపెరగని పోరాటయోధ

సనాతన కుటుంబంలోపుట్టినా, ఆచారసాంప్రదాయాలను ఆచరించడమేకాదు వాటిని ఉల్లంఘిస్తే ఏ మాత్రం సహించని తండ్రి మాటను ధిక్కరించి తన మార్గం కమ్యూనిస్టుమార్గం, జీవితాంతం కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తానని తెగేసి చెప్పి ఇల్లు విడిచివచ్చిన నిబద్ధ కమ్యూనిస్టు కోడుగంటి గోవిందరావు. చితికిపోయిన మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆరుగురిలో ఒకరైన గోవిందరావు మామ ఉద్యోగం ఇప్పించినా తన నిర్ణయం మార్చుకోనని ఖండితంగా చెప్పి ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేసుకున్నాడు.


కోడుగంటి గోవిందరావు

గోవిందరావుకు సంగీతం, నాటకాలంటే ఇష్టం. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో విశాఖ టౌన్‌హాల్‌లో బెర్నార్డ్ షా రచించిన యుద్ధ వ్యతిరేక నాటికలో చిన్న పాత్ర వేశాడు. దాంతో విద్యార్థి ఉద్యమనాయకులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. ఆనాడు ఆంధ్ర యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలు విద్యార్థి ఉద్యమాలకు కేంద్రాలుగా ఉన్నాయి. టౌన్‌హాల్‌లో మద్రాస్ ప్రావిన్స్‌లో మంత్రిగా పనిచేస్తున్న బెజవాడ గోపాలరెడ్డి సమావేశం జరుగుతున్న సమయంలో చిట్టివలస కార్మికులకు సంబంధించిన ఓ సమస్యపై ఆయనకు పిటిషన్ ఇవ్వడానికి నాటి కమ్యూనిస్టు నేత జొన్నలగడ్డ రామలింగయ్య నాయకత్వాన 3000 మంది కార్మికులు చిట్టివలస నుండి విశాఖకు తరలివచ్చారు. అప్పుడు రామలింగయ్య చేసిన ఆవేశపూరిత ప్రసంగం గోవిందరావు మనసులో చెరగని ముద్రవేసింది. అదే అతన్ని కమ్యూనిస్టుగా మార్చింది. రామలింగయ్య ఇచ్చిన గోర్కీ అమ్మ నవల చదివి చైతన్యవంతమైన గోవిందరావు ఆయన సలహామేరకు మరో కామ్రేడ్.కె.ఎస్ తిలక్‌తో కలిసి గోవిందరావు రాత్రి పాఠశాలలు నిర్వహించారు. ఆ విధంగా సమాజంలోని పేదలు, హరిజనులు, ఇతర సామాన్యప్రజల సమస్యలపై అవగాహన పెంచుకోవడమేగాక వారితో సంబంధాలను పెంచుకున్నాడు. చంద్ర రాజేశ్వరరావు, సుందరయ్యల నిరాడంబర జీవితం, త్యాగనిరతి, కార్మిక, కర్షక రాజ్యం కోసం వారు చేస్తున్న పోరాటాలు ఆయన మనస్సుకు హత్తుకునేలా ప్రభావం చూపాయి. ఈ దేశంలో పేదలు, సంపన్నులు లేని సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతున్నదన్న నమ్మకంతో కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. విజయనగరంజిల్లా ఆలమండలో కౌలురౌతులపై భూస్వాములు 1942లో జరిపిన కాల్పుల్లో ముగ్గురు కౌలురైతులు మరణించారు. కమ్యూనిస్టుపార్టీ నాయకుడుగా ఆ గ్రామం సందర్శించి గోవిందరావు అక్కడకు వచ్చిన సోషలిస్టులతో కలిసి భారీ ప్రదర్శన చేసి అక్కడే మకాం వేసిన డిఎస్‌పీని నిలదీసి కాల్పులకు పాల్పడ్డ భూస్వాములను అరెస్టు చేయించి, వారి వద్ద ఉన్న తుపాకులను స్వాధీనం చేసుకునేలా చేశారు. క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా బ్రిటిష్‌వారి నిర్బంధాలకు వ్యతిరేకంగా విజయనగరంలో జరిగిన విద్యార్థుల ప్రదర్శనకు నాయకత్వం వహించడంతో గోవిందరావు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు మాసాలు బళ్లారి జైలులో శిక్ష అనుభవించక తప్పలేదు. జైలు నుంచి రావడంతోనే జిల్లాపార్టీ ఆయనను అనకాపల్లి ఏరియాలో పార్టీ నిర్మాణానికి హోల్‌టైమర్‌గా పంపారు. విశాఖజిల్లాలో ప్రత్యేకించి అనకాపల్లి ప్రాంతంలో బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించారు. సాగు, త్రాగునీటికోసం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం జీవిత చరమాంకం వరకు పోరాడారు. 1948లో కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర నిర్బంధకాండ సందర్భంగా అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. అజ్ఞాతవాసం నుంచి బైటకు వచ్చిన తరువాత అరెస్టు చేసి కడలూరు జైలుకు తరలించారు.

అలుపెరగని పోరాటాలతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న గోవిందరావు అనకాపల్లి శాసనసభా నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. జై ఆంధ్రా ఉద్యమం సందర్భంగా అల్లరి మూక గోవిందరావు చుట్టూ చేరి అవమానకరంగా ప్రవర్తించి జై ఆంధ్ర అనమని ఒత్తిడి చేసినా నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. నిజాయితీ కలిగిన కమ్యూనిస్టుగా నిరూపించుకున్నాడు. ఆయన జీవితం నేటి తరం కమ్యూనిస్టులకు ఆదర్శంగా నిలుస్తుంది.

- ఎం.సి.వెంకటేశ్వర్లు

ఛాందసత్వానికి బలైన యోధుడు గోవింద్ పన్సారే

మతఛాందసవాదుల తూటాలకు నేల కూలిన అభ్యుదయ రచయిత, మహారాష్ట్ర కమ్యూనిస్టు యోధుడు గోవింద్ పన్సారే. మహారాష్ట్ర ప్రజలకు ఆరాధ్యనీయుడైన ఛత్రపతి శివాజీ ముస్లిం వ్యతిరేకి కాదని, లౌకిక భావాలు కలిగిన పాలకు డని, మనువాదానికి భిన్నంగా పాలన సాగించారని నిరూపించిన గొప్ప కమ్యూనిస్టు నేత గోవింద్ పన్సారే. శివాజీని హిందుత్వ నేతగా, ముస్లింలను ద్వేషించిన పాలకుడిగా చూపించి తమ మతతత్వ రాజకీయ పబ్బం గడుపుకోవాలని భావించిన హిం దుత్వ వాదుల పునాదులు కదిలించేలా ఆధారాలతో సహా నిరూపిస్తూ శివాజీ కోన్ హెూతా (శివాజీ ఎవరు?) అనే చిన్న పుస్తకాన్ని గోవింద్ పన్సారే 1987లోనే వెలువరించారు. హేతువాదిగా, కమ్యూ నిస్టు పార్టీ నేతగా ఆయన వెలుగులోకి తెచ్చిన ఆ చిన్న పుస్తకంలోని అంశాలను హిందుత్వ శక్తులు జీర్ణించుకోలేకపోయాయి. ఫలితంగా 2015 ఫిబ్రవరి 16 న కొల్హాపూర్లో తన సతీమణి సౌమ పన్సారేతో కలిసి ఉదయం నడకకోసం వెళ్లి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వారిపై కాల్పులు జరిపారు. ఇద్దరు ఉన్మాదులు జరిపిన ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన పన్సారే చికిత్స పొందుతూ ఫిబ్రవరి 20న కన్నుమూశారు.



గోవింద్ పన్సారే పూర్తి పేరు గోవింద్ పండారీ నాథ్ పన్సారే. ఆయన 1933 నవంబరు 26న అహ్మద్‌నగర్‌లోని శీరాంపూర్ తాలూకా కొల్హాపూర్ గ్రామంలో వ్యవసాయ కూలీలైన హర్నాబాయి, పండరీనాథ్ దంపతులకు జన్మించారు.పొలం అప్పులవాళ్ల వశమైనా... తల్లి పట్టుదలతో చదువుకోగలిగారు. అప్పటికే ఆ ప్రాంతంలో సోషలిస్టు భావాలతో నిర్వహిస్తున్న రాష్ట్ర సేవాదళ్ సంస్థలో చేరిన పన్సారే వారి సహకారంతో హైస్కూలులో చదువుకున్నారు.ఆ సంస్థ ప్రభావంతో కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావితులయ్యారు. కమ్యూనిస్టు నేత కాడూ పాటిల్ సహకారంతో బీఏ పూర్తి చేశారు. 1952లో ఆయన సిపిఐలో చేరారు. వామపక్ష ఉద్యమ పుస్తకాలు అమ్మే రిపబ్లిక్ బుక్‌షాపుల్లోనే ఉంటూ చదువు కొనసాగించారు. అ క్రమంలోనే సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం, గోవా విమోచన ఉద్యమాలలో భాగస్వాములయ్యారు. అనంతరం శివాజీ న్యాయ కళాశాలలో లా పూర్తి చేశారు. కొంతకాలం శివాజీ యూనివర్శిటీలో అధ్యాపకుడిగా పనిచేశాడు. 1962 నాటి భారత్ చైనా యుద్ధం నేపథ్యంలో చైనా సానుభూతిపరుడనే ముద్రతో అరెస్టయ్యారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ న్యాయవాద వృత్తి కొనసాగించారు. 1964 ద్వితీయార్థంలో పన్సారే సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా బాధ్యతల్ని నిర్వర్తించారు.

పన్సారే 'శ్రామిక ప్రతిష్ఠాన్'అనే సంస్థను ఏర్పాటు చేసి కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునేవారికి అండగా నిలిచారు. తన ముగ్గురు పిల్లలవి కులాంతర వివాహాలే. రాష్ట్రంలో టోల్ గేట్లకు వ్యతిరేకంగా పన్సారే నడిపిన ఉద్యయం అత్యంత ప్రభావాన్ని చూపింది. ఆ వివాదాన్ని సుప్రీం కోర్టు వరకూ తీసకెళ్లి కార్పొరేట్ శక్తులపై విజయం సాధించారు. శివాజీని ముస్లిం వ్యతిరేకిగా చిత్రిస్తున్న మతతత్వ రాజకీయ వాదులు శివాజీ మతాతీత పాలనపై సరైన చర్చ జరగడానికి ఇష్టపడరు. శివాజీ హిందూమతాన్ని నిలబెట్టడానికే అవతరించా డని, ముస్లింలను ద్వేషించాడనీ హిందూత్వ సంఘాలు ప్రచారం చేయడాన్ని పన్సారే తీవ్రంగా వ్యతిరేకించారు. బెదిరింపులను ఎదుర్కొ న్నారు. శివాజీ జీవితంలోని ప్రధానమైన అంశాలతో శివాజీ కోన్ హెూతా అనే చిన్న పుస్తకంలో శివాజీ ముస్లిం వ్యతిరేకి కాదని, సెక్యులర్ భావాలున్న పాలకుడని నిరూపించారు. మహిళలు, రైతుల కోసం సంస్కరణలు అమలు చేసిన పాలకుడని చూపించారు.

వెనకబడిన వర్గాలవారిని పెద్ద పదవుల్లో నియమించి బానిసత్వాన్ని వ్యతిరేకించాడని ఆధారా లతో సహా నిరూపించారు. ఈ పుస్తకం హిందీ, ఇంగ్లీష్, కన్నడ, ఉర్దూ, గుజరాతీ భాషలల్లోకి అనువాదమైంది. 1988లోనే తొలి ముద్రణ పొందిన పుస్తకం దాదాపు 38 పునర్ముద్రణలు అయింది. ఈ పుస్తకంలోని అంశాలు తమ రాజకీయ ఎత్తుగడలను దెబ్బతీస్తున్నాయని భావించిన మతతత్వ శక్తులు పన్సారేను భౌతికంగా లేకుండా చేస్తే తప్ప తమ పబ్బం గడవదని భావించి 2015లో ఆయనపై కాల్పులకు తెగబడి అంత మొందించారు. శివాజీపైనే కాకుండా పన్సారే హేతువాద దృష్టితో దాదాపు 21 పుస్తకాలను ప్రచురించిన అభ్యుదయ రచయిత, మరాఠా ప్రాంత కమ్యూనిస్టు యోధుడు పన్సారే.

- క్షేత్రపాల్

ప్రజా సమస్యలపై ఎస్పీ భారీ నిరసన ప్రదర్శన

- అడ్డుకున్న పోలీసులు...నడి రోడ్డుపై అఖిలేశ్ ధర్నా
- యోగి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శ

లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో ప్రజా సమస్యలను ఎండగడుతూ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అఖిలేశ్ యాదవ్ సోమవారం లక్నోలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు సమస్యలు, శాంతి భద్రతలు లోపించడం, రోడ్ల దుస్థితి వంటి ప్రజా సమస్యలపై అసెంబ్లీకి భారీ నిరసన ర్యాలీ తలపెట్టారు. అయితే అఖిలేశ్‌యాదవ్, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదని, ఆ పార్టీ నిర్ణయించిన మార్గంలో ర్యాలీని అనుమతించబోమని తెలపడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తొలుత అఖిలేశ్ సహా ఎస్పీ శ్రేణులు ఎస్పీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరగా, సమీపంలోని విక్రమాదిత్య మార్గ్ క్రాసింగ్ వద్దకు రాగానే ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా నిలువరించడంతో ఆగ్రహించిన అఖిలేశ్... పార్టీ నేతలతో క్రాసింగ్ వద్ద ధర్నాకు దిగారు. శాసనసభ మాజీ స్పీకర్ మాతా ప్రసాద్ పాండే అధ్యక్షతన అక్కడే మాక్ అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ధర్నా స్థలంలో అఖిలేశ్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీపై విరుచుకుపడ్డారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైనందున ఎస్పీని ఎదుర్కోవడం ఇష్టం లేకనే పోలీసులతో ర్యాలీని అడ్డుకుందని తెలిపారు. భారతదేశం వంటి గ్రామీణ దేశంలో పాలు, పెరుగు, నెయ్యిపై జీఎస్టీ విధించడం దారుణమని, ఆహార వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'వారు ప్రజలకు చూపించిన ఉద్యోగాల కలను నెరవేర్చలేకపోయారు... ఎందుకంటే వారు దానిని చేయడానికి వనరులను కనుగొ నడంలో విఫలమయ్యారు... యువకులు, పేదలు, దళితుల ఉద్యోగాలు ఇప్పుడు లాక్కుంటున్నారు... రైల్వేలు, విమానాశ్రయాలు అమ్మేశారు' అని ఆయన బీజేపీని దుయ్యబట్టారు. అగ్నివీర్ పథకంపై యువత అసంతృప్తితో ఉన్నారని, ప్రభు త్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపినందుకు యువకులపై తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. ఎస్పీ ఎమ్మెల్యేలు ఈ సమస్యలను సభలో లేవనెత్తి నిరసన తెలపాలనుకుంటే ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. ఈరోజు నిరసన ప్రదర్శన చేపడితే దానిని కూడా అన్యాయంగా అడ్డుకున్నారని, ఎమ్మె ల్యేలను సభలోకి రానివ్వడం లేదని తెలిపారు. అనంతరం సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) ఒక ట్వీట్ చేసింది. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలో అసెంబ్లీ వరకు ఆ పార్టీ చేపట్టిన భారీ ర్యాలీని పోలీసులు అడ్డుకున్న వీడియోను పోస్ట్ చేసింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించింది. కాగా ఎస్పీ తలపెట్టిన ప్రదర్శనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విలేకరులతో మాట్లాడుతూ... 'ప్రజాస్వామ్య పద్ధతిలో ఒక వ్యక్తి లేదా పార్టీ తన దృక్కోణాన్ని ముందుకు తెస్తే ఎటువంటి ఇబ్బంది లేదు. వారు నిబంధనల ప్రకారం అనుమతి కోరినట్లయితే, పోలీసులు వారికి సరైన మార్గాన్ని అందించే వారన్నారు. ప్రదర్శనలు ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని చెప్పారు. సమాజ్ వాదీ పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటుందని ఆశించడం అపోహేనని విమర్శించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఆందోళనకారులను నిలిపివేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) పీయూష్ మోర్డియా తెలిపారు.

ప్లీనరీ ఏర్పాట్లపై ఐజేయూ నేతల సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చెన్నైలో అక్టోబర్ 29, 30, 31 తేదీల్లో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 10వ జాతీయ ప్లీనరీ సమావేశాల ఏర్పాట్లను సోమవారం ఐజేయూ అధ్యక్షుడు కే.శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జనరల్ బల్వీందర్ సింగ్ -జమ్ము, ఎస్.ఎన్.సిన్హా సమీక్షించారు. ఈ ప్లీనరీకి అతిథ్యమిస్తున్న తమిళనాడు జర్నలిస్ట్స్ యూనియన్ (టీజేయు) రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎస్.ఆర్. సుభాష్, ప్రధాన కార్యదర్శి రమేష్, పాండిచ్చేరి రాష్ట్ర జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు మదిమహారాజతో పాటు ఆ రాష్ట్ర యూనియన్ ప్రధాన బాధ్యులు హాజరై ఏర్పాట్లను వివరించారు. ప్లీనరీకి దేశంలోని దాదాపు 25 రాష్ట్రాల నుంచి కౌన్సిల్ సభ్యులు హాజరవుతున్నందున వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా సంతృప్తికరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ప్రతినిధులకు వసతి సౌకర్యం, భోజన ఏర్పాట్ల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ

పంజాబ్ సీఎం వెల్లడి

చండీగఢ్: ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తోందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం వెల్లడించారు. 2004లో నిలిపివేసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో ఒకటి.'నా ప్రభుత్వం పాత పెన్షన్ సిస్టమ్‌కి తిరిగి రావాలని యోచిస్తోంది. దాని అమలుపై సాధ్యాసాధ్యాలు, విధి విధానాలను అధ్యయనం చేయమని నేను నా ప్రధాన కార్యదర్శిని కోరాను. మా ఉద్యోగుల సంక్షేమానికి మేము కట్టుబడి ఉన్నాము' అని మాన్ ట్విట్టర్‌లో తెలిపారు. పంజాబ్‌లో అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని గత ఏడాది ఆగస్టులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, ప్రస్తుత ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా హామీ ఇచ్చారు. కాగా సీఎం మాన్ ప్రకటనను పంజాబ్ సివిల్ సెక్రటేరియట్ స్టాఫ్ అసోసి యేషన్ చైర్మన్ సుఖ్‌చైన్ సింగ్ ఖైరా స్వాగతించారు.

ప్రొఫెసర్ హనీబాబు బెయిల్ పిటిషన్ కొట్టివేత

ముంబై: ఎల్గార్‌పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసులో ఆరోపణలెదుర్కొంటున్న దిల్లీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ హనీబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను బాంబే హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసులో బెయిల్‌ను తిరస్కరిస్తూ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హనీబాబు దాఖలు చేసిన అభ్యర్థనను కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తులు ఎస్.ఎం. జామ్దార్, ఎస్.ఆర్.బోర్కర్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిషేధిత మావోయిస్టు సంస్థ నేతల సూచనల మేరకు మావోయిస్టు కార్యకలాపాలు, భావజాలాన్ని వ్యాపింపజేయడంలో బాబు సహ-కుట్రదారుగా వ్యవహరిస్తున్నారని కేసును దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆరోపించింది. ఈ కేసులో హనీబాబు జులై 2020లో అరెస్టయ్యారు. ప్రస్తుతం నవీ ముంబైలోని తలోజా జైలులోఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన ముంబైలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ హనీ బాబు ఈ ఏడాది జూన్‌లో హైకోర్టును ఆశ్రయించారు. తనపై ప్రాథమిక స్థాయిలోనే నేరారోపణలు ఉన్నాయని ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ ఇవ్వకుండా తప్పు చేసిందని న్యాయవాదులు యుగ్ చౌదరి, పయోషి రాయ్ ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌లో బాబు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాని నరేంద్ర మోదీని హత్యచేయడానికి కుట్ర పన్నుతున్నట్లు ఎన్ఐఏ లేఖను ఉదహరించినప్పటికీ, ఆ లేఖ తనను దోషిగా చూపలేదని అన్నారు. 'అతను దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు లేదా మద్దతు ఇచ్చినట్లు ఎటువంటి ఆధారాలు లేవు' అని పిటిషన్ పేర్కొంది. నక్సలిజాన్ని ప్రోత్సహించే కార్యక్రమాల్లో బాబు చురుగ్గా పాల్గొంటున్నారని, ప్రభుత్వాన్ని కూలదోయాలని కోరుకుంటున్నారని పేర్కొంటూ బెయిల్ పిటిషన్‌ను ఎన్ఐఏ వ్యతిరేకించింది.

పాకలు తొలిగిస్తే ప్రజాందోళన

కాకినాడ కమిషనర్ కార్యాలయం ముట్టడించిన అయోధ్య నగర్ పేదలు

విశాలాంధ్ర - కాకినాడ: కాకినాడ స్మార్ట్ సిటీ ఎనిమిదో వార్డులో గల అయోధ్య నగర్‌లో 40 సంవత్సరాలు పైబడి నివాసం ఉంటున్న వారి పాకలను తొలగించాలని మున్సిపల్ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బాధితులంతా సీపీఐని ఆశ్రయించారు. మరో రెండు మూడు రోజుల్లో పాకలు ఖాళీచేయకపోతే తామే తొలగిస్తామిని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పేదలు సీపీఐ అధ్వర్యంలో సోమవారం ఉదయం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక స్మార్ట్ సిటీ కమిషనర్ కార్యాలయాన్ని అయోధ్య నగర్ పాకలవారు ముట్టడించారు. ఈ కార్యక్రమంలో పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యాలయంలోనికి ఎవరూ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మధు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఇక్కడ పాకలు వేసుకుని నగరులు జీవనం సాగిస్తున్నారని, వీరందరూ మట్టి పనికి వెళ్లి బతుకు ఈడుస్తున్నారన్నారు. అటువంటిది ప్రభుత్వం వీరిని ఖాళీ చేసి పార్కులు కట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. వీళ్లందరికీ ప్రత్యామ్నాయం చూపించి ఖాళీ చేస్తే న్యాయంగా ఉంటుంది తప్ప బలవంతంగా ఖాళీ చేయించడం దారుణం అన్నారు. చిన్నపిల్లలతో, సామాన్లతో రెండు రోజుల్లో ఎక్కడికి వెళతారని మధు ప్రశ్నించారు. పాకలను తొలగించే ఆలోచన మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ. సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జి లోవరత్నం, బొబ్బిలి శ్రీనివాస్ రావు, నారాయణ, సత్యనారాయణ, శ్రీను, మంగ, తాతయ్య, దుర్గారావు, లక్ష్మణ్ తదితరులు నాయకత్వం వహించారు.

బీజేపీలోని ఒక వర్గం వల్లే సీబీఐ... ఈడీ దుర్వినియోగం

- మమతా బెనర్జీ
- కేంద్ర దర్యాప్తు సంస్థల తీరుకు వ్యతిరేకంగా తీర్మానం ఆమోదం

కోల్‌కతా: రాష్ట్రంలో కేంద్ర దర్యాప్తు సంస్థల ఆరోపణ వెనుక ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారని తాను నమ్మడం లేదని, బీజేపీలోని ఒక వర్గం తమ ప్రయోజనాల కోసం వాటిని దుర్వినియోగం చేస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల మితిమీరిన వ్యవహారానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానంపై మాట్లాడిన బెనర్జీ, కేంద్ర ప్రభుత్వ అజెండా, అతని పార్టీ ప్రయోజనాలు కలవకుండా చూడాలని ప్రధానిని కోరారు. అనంతరం అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని బీజేపీ వ్యతిరేకించింది. 'ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. ఈ తీర్మానం ప్రత్యేకంగా ఎవరికీ వ్యతిరేకం కాదు. కేంద్ర సంస్థల పక్షపాత పనితీరుకు వ్యతిరేకం' అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత బెనర్జీ అన్నారు. సీబీఐ, ఈడీకి వ్యతిరేకంగా ఇటువంటి తీర్మానం అసెంబ్లీ నియమ నిబంధనలకు విరుద్ధమని ప్రతిపక్ష నేత సువేందు అధికారి అన్నారు. విభజన ద్వారా తీర్మానం ఆమోదించబడింది, దీనికి అనుకూలంగా 189, వ్యతిరేకంగా 69 ఓట్లు వచ్చాయి. సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు రాష్ట్రంలోని అనేక కేసులను విచారణ చేస్తున్నాయి. వీటిలో సీనియర్ టీఎంసీ నాయకులు నిందితులుగా ఉన్నారు.

మత్స్యకారులతో రాహుల్ భేటీ

- పెరిగిన ఇంధన ధరలు, తగ్గిన రాయితీల పై చర్చ
- కేరళలోని అలప్పుజలో 'భారత్ జోడో యాత్ర'

అలప్పుజ: కాంగ్రెస్ దేశవ్యాప్త భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది. ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం కేరళలోని అలప్పుజలోని పున్నప్ర అరవుకడ్ నుంచి 'భారత్ జోడో యాత్ర'ను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా అలప్పుజాలోని వడకల్ బీచ్‌లో మత్స్యకారులతో సంభాషించారు. తమ పార్టీ భారత్ జోడో యాత్ర 12వ రోజు ప్రారం భించడానికి ముందు వారు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఈ వయ నాడ్ ఎంపీ చర్చించారు. పెరుగుతున్న ఇంధన ధరలు, తగ్గిన సబ్సిడీలు, తగ్గుతున్న చేపల నిల్వలు, సరిపోని విద్యావకాశాలు, పర్యావరణ విధ్వంసం వంటి ఇతర సమస్యలపై చర్చలు జరిపారు. 'ఉదయం 6 గంటలకు రాహుల్ గాంధీ అలప్పు జాలోని వడకల్ బీచ్‌లో మత్స్యకారులతో వారి సవాళ్లు-పెరుగుతున్న ఇంధన ఖర్చులు, తగ్గిన సబ్సిడీలు, తగ్గుతున్న చేపల నిల్వలు, సామాజిక సంక్షేమం, పెన్షన్‌లు లేకపోవడం, విద్యావకాశాలు సరిపోకపోవడం, పర్యావరణ విధ్వంసంపై సంభాషించారు' అని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా భారత్ జోడో యాత్ర ప్రస్తుతం కేరళలో కొనసాగుతోంది. తదుపరి 12 రోజుల పాటు రాష్ట్రం గుండా ప్రయాణిస్తుంది. ఇదిలాఉండగా, కేరళలోని కొల్లంలో కూరగాయల వ్యాపారి నుంచి స్థానిక కాంగ్రెస్ నాయకులు విరాళాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపించిన వీడియో బయటకు రావడంతో యాత్ర వివాదంలో చిక్కుకుంది. భారత్ జోడో యాత్రకు నిధుల సేకరణకు రూ.2 వేలు ఇవ్వనందుకు కొల్లంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూరగాయల దుకాణదారుడిని బెదిరించారు.

చందు మొండేటితో అల్లు అర్జున్ సినిమా?

హైదరాబాద్: అల్లు అర్జున్ ప్రస్తుతం పుష్ప రెండో పార్ట్ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా అయ్యాక అతను ఎవరితో చేస్తాడు అన్నది చాలామందికి ఆసక్తికరంగా ఉంది. అందిన సమాచారం ప్రకారం మేరకు అల్లు అర్జున్ చందు మొండేటితో సినిమా చేయొచ్చు అని తెలిసింది. చందు కార్తికేయ-2 సినిమాతో మంచి విజయం అందుకున్నాడు. ఇది ఒక్క తెలుగులోనే కాకుండా, హిందీలో కూడా బ్రహ్మాండంగా ఆడింది. ఈ సినిమా చూసిన అల్లు అర్జున్ కొన్ని రోజుల క్రితం చందు మొండేటిని పిలిపించుకొని ఒక మంచి కథ తయారు చేయమని చెప్పాడని తెలిసింది. పుష్ప-2 పూర్తయ్యేందుకు చాలా సమయం ఉందని, ఈలోపు మంచి కథ చూసి స్క్రిప్ట్ కూడా పూర్తిగా రాసి తీసుకువస్తే బాగుంటుంది అని చందూకు అర్జున్ చెప్పినట్టు బోగట్టా. చందూ కూడా ఈలోపు ఏదైనా ఒక సినిమా చేయొచ్చు. లేదా అల్లు అర్జున్ ఇచ్చిన ఆఫర్‌తో కథ రాసుకోవచ్చు. ఏమైనా అల్లు అర్జున్ టాలెంట్ దర్శకులని బాగానే పట్టుకుంటున్నాడు. అంటే తన తదుపరి సినిమా కూడా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా అర్జున్ చేస్తున్నాడు అని అర్థం అవుతోంది.

మహేశ్‌తో గౌతమ్ మీనన్?

చెన్నై: తమిళ దర్శకులంటే మన హీరోలకు ప్రత్యేకమైన అభిమానం. అందుకే మురుగదాస్, లింగుస్వామి, గౌతమ్ మీనన్ లాంటి దర్శకులు తెలుగులో సినిమాలు తీస్తున్నారు. గౌతమ్ మీనన్ అయితే టాలీవుడ్‌కు ఎప్పుడూ టచ్‌లోనే ఉంటారు. ఇప్పుడు రామ్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. మహేశ్ బాబుతోనూ ఓ సినిమా చేయాలని ఆయన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ఆయన మహేశ్ కోసం ఓ కథ సిద్ధం చేశారు. మహేశ్-గౌతమ్ మీనన్ మధ్య కథా చర్చలు కూడా జరిగాయి. కానీ.. ఆ సినిమా పట్టాలెక్కలేదు. అదే కథ నాగచైతన్యకు చెప్పి 'ఏం మాయ చేశావె' రూపొందించారు. ఆ సినిమా హిట్టయ్యింది. 'మహేశ్‌కి లవ్ స్టోరీ చెప్పినప్పుడు 'మనం కలిస్తే ఓ మంచి యాక్షన్ సినిమా రావాలి. అలాంటి కథ ఉంటే చెప్పండి.. అన్నారు. నేను ఈసారి మహేశ్‌కి కథ చెబితే మంచి యాక్షన్ డ్రామానే చెబుతా. మా ఇద్దరి సినిమా ఎప్పుడైనా ఉండొచ్చు' అన్నారు గౌతమ్ మీనన్. అంతేకాదు.. రామ్ చరణ్‌తోనూ గౌతమ్ ఓ సినిమా చేయాలని భావించారు. అది కూడా అప్పట్లో చర్చల దశలోనే ఆగిపోయింది. "చరణ్‌తో సినిమా అనుకున్న మాట నిజమే. కానీ.. ఆ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయింది. అయితే ఇప్పటికీ నేను చరణ్‌తో టచ్‌లోనే ఉన్నా" అని చెప్పారు గౌతమ్ మీనన్.

శంకర్‌తో యశ్ పాన్ ఇండియా చిత్రం

బెంగళూరు: 'కేజీఎఫ్' సిరీస్‌తో యశ్ పాన్ ఇండియా స్టార్ అయిపోయాడు. ఇప్పుడు తనకు కథ చెప్పి ఒప్పించడానికి దేశంలోని అగ్ర దర్శకులు, నిర్మాతలు క్యూలో ఉన్నారు. అయితే యశ్ తొందరపడడం లేదు. తన క్రేజ్, ఇమేజ్‌ని దృష్టిలో ఉంచుకునే కథల్ని ఎంచుకొంటున్నాడు. తాజాగా శంకర్ చెప్పిన ఓ కథకు యశ్ పచ్చజెండా ఊపాడని తెలుస్తోంది. సుప్రసిద్ధ తమిళ నవల 'వల్పరి'ని శంకర్ వెండి తెరపైకి తీసుకురావాలనుకొంటున్నారు. ఇందులో భాగంగా యశ్‌ని కలిసినట్టు సమాచారం. యశ్‌కి కూడా 'వల్పరి' నవల అంటే చాలా ఇష్టమట. అందుకే శంకర్ ఈ ప్రతిపాదన తీసుకురాగానే మరో ఆలోచన లేకుండా 'ఓకే' చేసినట్టు తెలుస్తోంది. కరణ్ జోహార్, పెన్ స్టూడియోస్‌తో కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడని, నెట్ ఫ్లిక్స్ సంస్థ కూడా చేతులు కలుపుతోందని టాక్. శంకర్ చేతిలో ప్రస్తుతం మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. 'భారతీయుడు 2'ని ఆయన పూర్తి చేయాలి. మరోవైపు రామ్ చరణ్‌తో ఓ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. 'అపరిచితుడు'ని హిందీలో తెరకెక్కించబోతున్నారాయన. ఇవన్నీ అయ్యాకే యశ్ సినిమా ఉండొచ్చు. ప్రస్తుతం 'వల్పరి'ని సినిమాకు అనుగుణంగా మారుస్తున్నట్టు అందుకోసం పలువురు తమిళ రచయితలు పని చేస్తున్నట్టు తెలుస్తోంది.

క్రీడాకారులను చూసే దృక్కోణం మారాలి: వినేశ్

న్యూదిల్లీ: కామన్‌వెల్త్ 2022 పతక విజేత, భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ కీలక వ్యాఖ్యలు చేశారు. క్వాలిఫికేషన్ రౌండ్లో మంగోలియా రెజ్లర్ ఖులాన్ బత్ఖుయాగ్ చేతిలో పరాజయం పాలైన ఆమె.. ఆ తరవాత అనూహ్యంగా కాంస్య పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అయితే ఓటమిపాలైనప్పుడు తనపై వచ్చిన విమర్శలను తాజాగా వినేశ్ తీవ్రంగా తప్పుబట్టారు. భారత క్రీడాకారులను చూసే దృక్కోణం మారాలనీ, నిరంతరం విమర్శించడమే పనిగా పెట్టుకోకుండా వారు ఎంత గొప్పగా ప్రయత్నిస్తున్నారో గుర్తించండని ట్విటర్ వేదికగా ఆమె పంచుకున్న సుదీర్ఘమైన పోస్ట్ ఇప్పుడు సంచలనంగా మారింది. 'తాపీగా ఇంట్లో కూర్చుని విమర్శలు చేయడమనే సంప్రదాయం ఒక్క ఇండియాలోనే ఉందా? లేక ఇతర దేశాల్లోనూ ఇలాగే ఉంటుందా నాకు తెలియదు. అథ్లెట్ అయినంత మాత్రాన ప్రతి టోర్నమెంట్‌కు మేం రోబోలలాగా పనిచేయాలని లేదు. మేమూ మనుషులమే. కష్టనష్టాలకు ఏ వ్యక్తీ అతీతులు కాదు. మ్యాచ్ అనేది చూసేవారికి ఒకరోజు కాలక్షేపం మాత్రమే. కానీ కొందరు చేసే విమర్శలు మమ్మల్ని ఎంతలా కిందకు లాగేస్తాయో వారికి అర్థం కాదు. ఇప్పటికైనా మీ వ్యాఖ్యలపై మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నా' అంటూ ఆమె పోస్ట్ చేశారు. ఇటువంటి సంస్కృతికి చరమగీతం పాడాలంటూ ఆమె తోటి క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఆసీస్‌తో టీ20 సిరీస్

మొహాలీ: టీ20 ప్రపంచకప్‌నకు ముందు రిహార్సల్స్.. బ్యాటింగ్, బౌలింగ్ ఆర్డర్‌ను సరి చేసుకునేందుకు భారత్‌కు మంచి తరుణం దొరికింది. ఆస్ట్రేలియాతో మూడు టీ20ల సిరీస్‌ల్లో భాగంగా మంగళవారం తొలి మ్యాచ్ జరగనుంది. సీనియర్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం నుంచి కోలుకొని వచ్చాడు. అలాగే యువ బౌలర్ హర్షల్ పటేల్ కూడా జట్టుతో చేరాడు. వీరిద్దరూ టీ20 ప్రపంచకప్ జట్టులోనూ ఉన్నారు. దీంతో చాలా రోజుల తర్వాత మైదానంలోకి దిగుతున్న బుమ్రా, పటేల్ ఎలా రాణిస్తారనేది వేచి చూడాలి. ప్రపంచకప్ నాటికి బౌలింగ్ లయను అందుకోవాలని భారత్ ఆశిస్తోంది. ఇక ఓపెనర్లు రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ కూడా భారీ ఇన్నింగ్స్‌లు ఆడాల్సిన అవసరం ఉంది. విరాట్ కోహ్లి ఇప్పటికే ఫామ్ అందుకొని ఉండటం టీమిండియాకు సానుకూలాంశం. సూర్యకుమార్, హార్దిక్ పాండ్య, రిషభ్ పంత్/దినేశ్ కార్తిక్ కూడా మంచి ఇన్నింగ్స్ ఆడి చాలాకాలమైంది. తుది జట్టు కూర్పుపై దృష్టి పెట్టాలి. బుమ్రా, హర్షల్, భువనేశ్వర్, ఉమేశ్ యాదవ్‌తో బౌలింగ్ దళం పటిష్ఠంగానే ఉంది. భారత్-ఆస్ట్రేలియా జట్ల జయాపజయాలు 13-9గా ఉంది.

షెడ్యూల్ ఇదే..

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడు టీ20లు జరుగుతాయి. తొలి మ్యాచ్ సెప్టెంబర్ 20 (మంగళవారం) మొహాలీ వేదికగా జరుగుతుంది. రెండో టీ20 మ్యాచ్ నాగ్‌పూర్ వేదికగా సెప్టెంబర్ 23 (శుక్రవారం), చివరి టీ20 హైదరాబాద్ వేదికగా సెప్టెంబర్ 25 (ఆదివారం) జరగనుంది. తొలి మ్యాచ్ సాయంత్రం 7.30 గంటలకు ప్రారంభమవుతుంది. స్టార్‌స్పోర్ట్స్, డిస్నీ+హాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో వీక్షించే అవకాశం ఉంది.

జట్ల వివరాలు:

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, దీపక్ హుడా, రిషభ్ పంత్, దినేశ్ కార్తిక్, హార్దిక్ పాండ్య, రవిచంద్రన్ అశ్విన్, యుజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, ఉమేశ్ యాదవ్, బుమ్రా, దీపక్ చాహర్, హర్షల్ పటేల్.

ఆస్ట్రేలియా: ఆరోన్ ఫించ్ (కెప్టెన్), సీన్ అబాట్, ఆస్టన్ అగర్, ప్యాట్ కమిన్స్, టిమ్ డేవిడ్, నాథన్ ఎల్లిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, జోష్ ఇగ్లిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, కేన్ రిచర్డ్‌సన్, డానియల్ సామ్స్, స్టీవ్ స్మిత్, మ్యాథ్యూ వేడ్, ఆడమ్ జంపా.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.